Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 23.08.2019, శుక్రవారం సంపుటి : 39 సంచిక : 12 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

- రాజధాని మార్పుపై ఊహాగానాలు
- తెరపైకి మళ్ళీ దొనకొండ
- స్పష్టత ఇవ్వని ప్రభుత్వం



# అమరావతి అనుమానమే..?


**రాష్ట్ర విభజనను అప్పుడు కేంద్రంలోని దుష్టశక్తులు ఏ దుర్ముహూర్తంలో చేశాయోగాని ఆంధ్రప్రదేశ్ ప్రజలకు 'రాజధాని' అన్నది ఇప్పటికీ పెద్ద ప్రశ్నగానే మారింది. హైదరాబాద్ నగరం మనది కాదు అనుకున్నాక ఇక రాజధానిగా ఏ నగరంపై కూడా పూర్తిస్థాయి స్పష్టత రాకుండా పోతోంది.**

రాష్ట్ర రాజధాని అంశం మరోసారి వార్తల్లోకి ఎక్కింది. వైసిపి అధికారంలోకి వచ్చినప్పుడే రాజధానిగా అమరావతిపై అనుమాన మేఘాలు అలుముకున్నాయి. రాజధానిపై చంద్రబాబులాగా జగన్ వూహల్లో విహరించే ప్రయత్నం చేయడు. లండన్, సింగపూర్, దుబాయ్, బీజింగ్‌ల వంటి రాజధాని నిర్మాణం అంటూ చంద్రబాబులాగా జగన్ ఆర్భాటం చేయడు. జగన్ దృష్టిలో రాజధాని అంటే కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం మాత్రమే! కాబట్టి అమరావతి గురించి చంద్రబాబు స్థాయిలో జగన్ గాలిమేడలు కట్టడన్నది ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టగానే అర్ధమైపోయింది.

తాజాగా పట్టణాభివృద్ధి శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాలలో చర్చకు దారి తీసింది. శివరామకృష్ణన్ కమిటి పేర్కొన్నట్లు అమరావతి ప్రాంతం రాజధాని నిర్మాణానికి అంత అనుకూలమైనది కాదు. ఇక్కడ నిర్మాణం ఖర్చు అత్యంత వ్యయంతో కూడుకున్న పని. బయట ప్రాంతంలో ఒక లక్షతో కట్టే ఇంటిని, ఇక్కడ రెండు లక్షలతో కట్టాల్సి వస్తుంది. కాబట్టి రాజధానిపై పునఃపరిశీలన చేస్తున్నామని ఆయన చేసిన ప్రకటనతో రాజధానిపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

రాష్ట్ర విభజన సమయంలో జస్టిస్ శివరామకృష్ణన్ కమిటి రాష్ట్రంలో పర్యటించి రాజధాని నిర్మాణానికి ప్రకాశం – గుంటూరు జిల్లాల మధ్య దొనకొండ – వినుకొండ ప్రాంతాలను అనువైనవిగా సూచించింది. అమరావతికి వరద ముప్పు వుందని, అదీగాక అక్కడ మూడు పంటలు పండే పొలాలున్నాయని, వ్యవసాయం దెబ్బతింటుందని, నల్లరేగడి నేలలు కావడంతో అక్కడ నిర్మాణాలు చేపట్టడం కూడా అంత మంచిది కాదని సూచించింది. 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు శివరామకృష్ణన్ కమిటీ సూచనలను పెడచెవిన పెట్టాడు. కొంత కులపిచ్చి, కొంత వాస్తు పిచ్చితో అమరావతి పరిసరప్రాంతాలను రాజధానికి ఎంపిక చేశాడు. నయానోభయానో 33వేల ఎకరాల భూసేకరణ కూడా జరిపించాడు. వందల కోట్ల ఖర్చుతో శంకుస్థాపనలు కూడా చేయించాడు. ప్రపంచంలోనే ఎక్కడా లేనివిధంగా చదరపు అడుగు

(మిగతా 11వ పేజీలో)




## కృష్ణపట్నం పోర్టులోకి... అడుగుపెట్టిన అదాని!

- 72శాతం వాటా కొనుగోలు

**నెల్లూరుజిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభమై, శరవేగంగా అభివృద్ధి చెందిన కృష్ణపట్నం పోర్టు... ఇప్పుడు చేతులు మారనుంది. తెలుగువారి ఆధిపత్యం నుండి ఉత్తరాది వారి ఆధీనంలోకి వెళ్ళబోతోంది.**

భారత పారిశ్రామిక దిగ్గజాలలో ఒకటైన అదాని గ్రూప్ నెల్లూరుజిల్లా కృష్ణపట్నం పోర్టులో అడుగుపెట్టింది. దేశంలోని ప్రైవేట్ పోర్టుల్లో రెండో స్థానానికి ఎదిగిన నెల్లూరుజిల్లాలోని కృష్ణపట్నం పోర్టులో 72శాతం వాటాలను కొనుగోలు చేసింది. దీని విలువ దాదాపు 5,500 కోట్లుగా అంచనా వేశారని సమాచారం. కృష్ణపట్నం పోర్టు కంపెనీలో ఛైర్మెన్ సి.విశ్వేశ్వరరావు, డైరెక్టర్ చింతా శ్రీధర్, ఇంకో ఇద్దరు వాటాదారుల షేర్‌లను

(మిగతా 11వ పేజీలో)






## పాపం పండింది

- ఆంధ్రుల ఉసురు తగిలింది
- ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కాంగ్రెస్ నేత చిదంబరం అరెస్ట్

(వివరాలు 11వ పేజీలో)

# బిట్రగుంట రైల్వే అభివృద్ధికి సహకరించండి

## కేంద్ర రైల్వేశాఖ మంత్రిని కోరిన ఆదాల



నెల్లూరు పార్లమెంట్‌సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఈ నెల 21వ తేదీన ఢిల్లీలో కేంద్ర రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయెల్‌ను రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డితో వెళ్లి కలిశారు. జిల్లాలోని బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై ఆయనకు వినతిపత్రం సమర్పించారు. బిట్రగుంటలో రైల్వేకు 11వందల ఎకరాల స్థలముందని, ఎన్నో మౌలిక సదుపాయాలున్నాయని, కాంక్రీట్ స్లీపర్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్, ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్ మెయింటెనెన్స్ సెంటర్ లేదా క్యారేజ్ అండ్ వ్యాగన్ వర్క్ షాపులలో ఏదో ఒకటి ఏర్పాటు చేయడానికి అనువుగా వుంటుందని ఆయన ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. రైల్వే పరిశ్రమ ఏర్పాటుతో జిల్లావాసులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు స్థానికంగా అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. అలాగే గూడూరు, విజయవాడల మధ్య కొత్తగా ప్రవేశపెడుతున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు బిట్రగుంటలో స్టాపింగ్ ఇవ్వాలని ఆదాల కోరారు.

# సూళ్ళూరుపేట అభివృద్ధికి కృషి చేస్తా!

## - ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట మండల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసేందుకు అన్ని శాఖల అధికారులతో సమీక్షలు జరుపుతున్నామని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. ఈనెల 19న ఆయన సూళ్ళూరుపేట పట్టణంలో పర్యటించిన అనంతరం మాట్లాడుతూ మండలంలో పేర్నాడు రోడ్డు, పేర్నాడు దీవుల్లో అంతర్గత రోడ్లు, తడ మండలం వేనాడుకు వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. దీనికి కలెక్టర్ జాతీయ ఉపాధిహామీ పథకం కింద రూ.3కోట్లు పంచాయితీరాజ్ శాఖకు మంజూరు చేశారని, ఈ రెండు రోడ్లు పీఆర్ నుంచి ఆర్అండ్‌బీ శాఖకు బదలాయించడంతో పనులు ఆగిపోయాయన్నారు. ఈ నిధులను మళ్ళించుకుని పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఇందుకు సూళ్ళూరుపేట వన్యప్రాణి సంరక్షణ విభాగం అధికారులు పనులకు ఆటంకం కలిగించకుండా భూమిని రెవిన్యూ శాఖ నుంచి అప్పగించే ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. కాళంగి నదిలో వాటంబేడు వద్ద చెక్‌డ్యాం నిర్మాణ పనులు పూర్తిచేసి 8వేల ఎకరాలకు నీరు, సుమారు 10 గ్రామాలకు తాగునీరు అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. సూళ్ళూరుపేట-శ్రీకాళహస్తి సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా వేసేందుకు సిద్దంగా ఉందన్నారు. వైస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి రాజసులోచనమ్మ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి దబ్బల శ్రీమంత్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణపట్నం పోర్టు వద్ద భారీ ఉక్కు పరిశ్రమ

కృష్ణపట్నం పోర్టు సమీపంలో చైనాకు చెందిన ఓ భారీ ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఆ కంపెనీ ప్రతినిధులు గతంలో రెండుసార్లు కృష్ణపట్నం పోర్టు వద్ద భూములు సమీకరించారు. తాజాగా ఈ నెల 21న మరోసారి పోర్టు పరిసరాలలో పర్యటించారు. 10వేలకోట్ల వ్యయంతో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తారని సమాచారం. ఈ పరిశ్రమ వస్తే ప్రత్యక్షంగా 10వేల మందికి, పరోక్షంగా ఇంకొంతమందికి ఉపాధి అవకాశాలుంటాయి.



# పరిశ్రమలతో పండుగ తెద్దాం!

## • సులభతర వాణిజ్య సదస్సులో మంత్రులు

నెల్లూరుజిల్లాను పారిశ్రామికాభివృద్ధికి పెట్టనికోటగా మారుస్తామని, పరిశ్రమలతో జిల్లాకు పండుగ వాతావరణం తెస్తామని జిల్లా మంత్రులు మేకపాటి గౌతమ్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్‌లు వెల్లడించారు. ఈనెల 21వ తేదీన నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సులభతర వాణిజ్య విధానంపై పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సదస్సులో రాష్ట్ర ఐ.టి పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్, ఏపిఐఐసి ఛైర్మెన్, ఎమ్మెల్యే ఆర్.కె.రోజా, ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, వి.వరప్రసాద్, జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్ధజైన్, ప్రిన్సిపల్ కార్యదర్శి రజత్‌భార్గవ తదితరులు పాల్గొన్నారు. నూతన పారిశ్రామికవిధానం తీసుకొచ్చి రాష్ట్రంలో, నెల్లూరుజిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అనువైన వాతావరణం కల్పిస్తామని పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి చెప్పారు. గత తెలుగుదేశం ప్రభుత్వం పారిశ్రామిక విధానాన్ని గందరగోళంగా మార్చిందని, తమకు నచ్చిన వారికి ఎకరా 12లక్షలకు, నచ్చనివారికి అక్కడే ఎకరాను 33లక్షల లెక్కన ఇచ్చి వ్యత్యాసం చూపడంతో పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రాలేదన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు 12వేల ఎకరాల భూమి ఏపిఐఐసి వద్ద అందుబాటులో వుందని, పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నీళ్ళ శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ పరిశ్రమలకు అవసరమైన నీటిని అందించేందుకు కృషి చేస్తానన్నారు. అందరం కలిసి జిల్లాను పారిశ్రామికంగా అగ్రస్థానంలో నిలుపుతామన్నారు.

ఏపిఐఐసి ఛైర్మెన్ ఆర్.కె.రోజా మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ఒక్క దరఖాస్తుతోనే అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాలో వున్న అన్ని పారిశ్రామిక సెజ్‌ల అభివృద్ధికి కట్టుబడి వున్నామని, పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానిక యువతకు ఎక్కువగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.

# సభ్యత్వ నమోదులో జిల్లాలో కమల వికాసం



సమావేశంలో మాట్లాడుతున్న పి.సురేంద్రరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి

భారతీయ జనతాపార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రాష్ట్రంలోనే నెల్లూరుజిల్లా అగ్రస్థానంలో నిలిచిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి వెల్లడించాడు. ఈ నెల 21వ తేదీ నెల్లూరు మినీబైపాస్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో లక్ష సభ్యత్వాలు లక్ష్యం కాగా, లక్ష్యాన్ని అధిగమించి లక్షా 5వేల మంది సభ్యత్వాన్ని నమోదు చేశామనాడు. ఈ నెల 31 నుండి పార్టీ సంస్థాగత ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ మొదలు కానుందని, ఈ ఎన్నికల అధికారులుగా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డిలను నియమించారని ఆయన పేర్కొన్నాడు. జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన సందర్భంగా నెల్లూరులో నిర్వహించే కార్యక్రమానికి కేంద్ర హోంశాఖా సహాయమంత్రి కిషన్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ఈ నెల 24, 25, 26 తేదీలలో భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు నెల్లూరుజిల్లాలో పర్యటించనున్నారని, కేంద్ర రైల్వే శాఖామంత్రి పీయుష్ గోయల్, కేంద్ర రక్షణశాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి కిషన్‌రెడ్డి కూడా హాజరు కానున్నారని ఆయన తెలిపాడు. రాష్ట్రంలో 3నెలల్లోనే వైసిపి పాలన అస్తవ్యస్థంగా మారిందని విమర్శించారు. ముఖ్యమంత్రి వై.యస్.జగన్మోహన్‌రెడ్డి నిర్ణయాలు ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేస్తున్నాయన్నారు. రాజధానిపై అస్పష్టత, పోలవరం టెండర్ల రద్దు, అన్న క్యాంటిన్‌ల మూసివేత, ఇసుకపై స్పష్టమైన విధానం లేకపోవడం వంటివాటితో రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ఆయన అన్నాడు. జగన్ తీసుకుంటున్న నిర్ణయాలతో కేంద్రం నుండి రాష్ట్రానికి వచ్చే నిధులు కూడా ఆగిపోతాయేమోననే భయాందోళనలు ప్రజల్లో నెలకొన్నాయని ఆయన పేర్కొన్నాడు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు కర్నాటి ఆంజనేయరెడ్డి, ఎం.ఈశ్వరయ్య, కుడుముల సుధాకర్‌రెడ్డి, జి.అశోక్, వంశీధర్‌రెడ్డి, నాగరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


# నీళ్ళపై ఇంత నిర్లక్ష్యమా? - ఎమ్మెల్సీ బీద



కృష్ణాజిల్లాలో వరదలు వచ్చి ఊళ్లకు ఊళ్లు మునిగిపోతుంటే ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పత్తా లేకుండా పోయారని, వరదల రూపంలో కృష్ణానదికి వచ్చిన వందలాది టీఎంసీల నీటిని సముద్రం పాల్జేశారని టీడీపీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర ధ్వజమెత్తారు. ఈనెల 20న నెల్లూరులోని ఎన్టీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా కృష్ణానదికి వరద పోటెత్తితే ఆ నీటిని సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కరువుతో అల్లాడుతున్న రాయలసీమ, నెల్లూరు జిల్లాలకు ఆ వరదనీటిని తరలించాలన్న ఆలోచన కూడా చేయకపోవడం ముఖ్యమంత్రి పనితీరుకు నిదర్శనమన్నారు. గత ఏడాది తమ ప్రభుత్వ హయాంలో కృష్ణానదికి వరదలు రాకపోయినా శ్రీశైలం నుంచి 48 టీఎంసీలను సోమశిలకు తీసుకొచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. తెలంగాణా ప్రభుత్వంతో ఏవైనా ఇబ్బందులొస్తాయని రాష్ట్ర ప్రభుత్వం నీటి తరలింపుపై బయటకు చెప్పలేకపోతుందేమోనని అంతా భావించామని తీరా చూస్తే అసలు నీటినే తరలించలేదన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్‌లో 840 అడుగుల నీటిమట్టం దాటితే పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి సోమశిలకు నీరిచ్చే అవకాశం ఉందని, ఆగస్టు 2వ తేదీకే ఈ అవకాశం వచ్చిందని, అయితే ప్రభుత్వం పట్టించుకోలేదని ఆరోపించారు. ఆగస్టు 2వతేదీ నుంచే సోమశిలకు నీటిని వదిలుంటే ఈ పాటికి కనీసం 30 టీఎంసీలకు చేరేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల కేవలం 4టీఎంసీలు కూడా చేరలేదన్నారు. ఈ సమావేశంలో మాజీ మేయర్ అబ్దుల్ అజీజ్, నీటి సంఘాల నాయకులు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, రాపూరు సుందర రామిరెడ్డి, సుబ్బానాయుడు, హరిబాబు యాదవ్, రంగారావు, బండి రమేష్ పాల్గొన్నారు.

## సమర్ధతకు సూచిక!... సమున్నత దీపిక!

# ‘లిజనింగ్, లెర్నింగ్ అండ్ లీడింగ్’




ప్రతి విషయాన్ని ముందుగా బాగా ఆలోచించుకోవాలి. చేయదగిన పనిని చర్చించుకోవాలి. మంచి నిర్ణయాలు తీసుకోవాలి. చేయదలచిన మంచి కార్యక్రమాన్ని పరిపూర్ణంగా చేసి ప్రజలకు అందించాలి. తద్వారా దేశాభ్యున్నతికి మనవంతు కృషిచేయాలి. అత్యున్నత భారత్ మనందరి లక్ష్యం కావాలి. సమున్నత భారత్‌ను సాకారం చేసుకోవాలి...

‘లిజనింగ్, లెర్నింగ్..అండ్ లీడింగ్’

భారత ఉపరాష్ట్రపతిగా రెండేళ్ళు అనితరసాధ్యమైన రీతిలో అద్వితీయంగా పనిచేసి అందరి ప్రశంసలు అందుకుంటూ, తన విశేష ప్రతిభతో అశేష ప్రజల ఆదరాభిమానాలు పొందుతూ, భరతమాత ముద్దుబిడ్డగా.. దేశానికే గర్వకారణంగా నిలిచిన మన నెల్లూరీయుడు... అందరికీ ఎంతో ఆత్మీయుడు.. ముప్పవరపు వెంకయ్యానాయుడి సమర్ధతకు సూచికగా.. సమున్నత దీపికగా ఒక అపురూపమైన గ్రంథం ఇటీవలే చెన్నైలో ఆవిష్కృతమైన విషయం పాఠకులకు తెలిసిందే. ‘లిజనింగ్, లెర్నింగ్ అండ్ లీడింగ్’. (వినడం, నేర్చుకోవడం, నాయకత్వం వహించడం) పేరుతో ఆవిష్కృతమైన ఈ పుస్తకంలో ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పాల్గొన్న కార్యక్రమాలు, ఆయన ఆలోచనలు..ప్రసంగాల వివరాలన్నీ ఉన్నాయి.

ఎన్నో అపురూపమైన, అందరూ తెలుసుకోవాల్సిన విషయాలెన్నో ఈ పుస్తకంలో ఉన్నాయి. ఎదుటివారు చెప్పేది వినడం, తెలుసుకోవాల్సిన విషయాలను అధ్యయనం చేసి నేర్చుకోవడం, అన్నిటినీ క్రోడీకరించుకుని నాయకత్వపటిమతో ప్రజల సమస్యలు తీర్చడం.. తద్వారా దేశాభ్యున్నతికి వెలుగుబాటలు వేయడం..ఇదీ వెంకయ్యానాయుడి లక్షణం. అదే ఆయన కార్యాచరణ కూడా. ఆయనెంతటి కార్యదీక్షాపరులో ఈ పుస్తకం మన కళ్ళకు కట్టినట్లుగా తెలియజెప్తోంది. ఆ పుస్తకంలోని కొన్ని ముఖ్యమైన విశేషాలివీ!..



### లిజనింగ్..లెర్నింగ్...అండ్ లీడింగ్!...

**ఒక్కమాటలో చెప్పాలంటే...ఈ పుస్తకం వెంకయ్య కార్యదీక్షాదక్షతకు ప్రతీక... ఆయన అసమాన ప్రజ్ఞా పాటవాలకు పతాక. దేశాభ్యున్నతి కోసం ఎన్నెన్నో గొప్ప ఆలోచనలు చేస్తూ, ఆ ఆలోచనలను సాకారం చేసుకోవడానికి ఏమి చేయాలో చేయడం ఆయన నిత్యకృత్యం. భారత ఉపరాష్ట్రపతి పదవిలో ఉన్నా ఆయనకు ప్రజాసమస్యల పరిష్కారంపైనే ధ్యాస. దేశంలోని వివిధ రంగాల అభివృద్ధికై ఆయన నిరంతరం ఆలోచనలు చేస్తూనే ఉంటారు. రైతన్నల గుండె చప్పుడు విని వారి సమస్యలను సహృదయంతో అర్థం చేసుకుని తగు పరిష్కారాలు చూపించడం, యువతతో మాటామంతీ మాట్లాడుతూ దేశభవితకు మార్గదర్శనం చేయడం, విజ్ఞాన శాస్త్రవేత్తలు, వైద్యులతో చర్చలు సాగించి సమాజసేవకు బాటలు వేయడం, ప్రపంచంలోనే ఎంతో గొప్పదైన భారత సంస్కృతిని మరింతగా ద్విగుణీకృతం చేస్తూ దేశంలో సాంస్కృతిక పునర్వైభవానికి సమాలోచనలు చేయడం, ప్రపంచ వ్యాప్తంగా అనేకదేశాల్లో పర్యటించి ఆయా దేశాలతో మన దేశానికి ఉన్న దౌత్యపరమైన సంబంధాలను మరింతగా బలోపేతం చేయడం, అన్నిటికీ మించి..అత్యంత సమర్ధత కలిగిన నాయకునిగా రాజ్యసభలో రాణించడం..ఇవన్నీ వెంకయ్యానాయుడి ప్రజ్ఞాపాఠవాలకు నిదర్శనాలు. సమతా మమతా మూర్తీభవించిన గొప్ప సుగుణాలు. నవభారత నిర్మాణమే ధ్యేయంగా, మాటలతో కాక చేతలతో పనిచేసే ధీశాలి ఆయన. గుండెనిండా దేశభక్తినీ..అమేయమైన దేశశక్తినీ చాటుకుంటూ ఆయన చేసిన..చేస్తున్న అత్యద్భుత ప్రసంగాలు..యువతకు స్ఫూర్తిదాయకాలు. యువతకు, విద్యార్థులకే కాదు...భారతీయులందరికీ మార్గదర్శకాలు.**




### రెండేళ్ళలోనే 330 కార్యక్రమాలు...

భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కేవలం రెండేళ్ళ కాలంలోనే దాదాపు 330 కార్యక్రమాల్లో పాల్గొన్నారంటే అంతటి సమున్నతమైన పదవిలో కూడా ఒక్క క్షణం కూడా వృథా చేయకుండా దేశాభ్యున్నతికి ఆయన చేస్తున్న నిరంతర కృషికి ఇదొక నిదర్శనమనే చెప్పాలి. తెలుగుదనం తొణికిసలాడేలా నిండైన తెల్లని పంచెకట్టుతో, ఎప్పుడూ చెదరని చిరునవ్వుతో అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ..ఉండే మన వెంకయ్య.. దేశంలో ఎన్నో చోట్ల పర్యటిస్తూ.. ఆలోచనాత్మకమైన..ఆచరణాత్మకమైన తన ప్రసంగాల ద్వారా దేశాభివృద్ధికి బాటలు వేస్తుండడం విశేషం. దేశంలోని అనేక విద్యాలయాలనూ, విజ్ఞాన-సాంకేతిక పరిశోధనా సంస్థలను సందర్శించి 97 కార్యక్రమాల్లో పాల్గొనడమే కాక, వీటిలో 25 సంస్థల్లో ఎంతో విజ్ఞానదాయకమైన ప్రత్యేక ప్రసంగాలు కూడా చేశారు. మరో 35 సమావేశాల్లో విద్యార్థుల భవితకు సంబంధించి, దేశాభ్యున్నతి గురించి అత్యద్భుతమైన రీతిలో ప్రసంగించారు. గత రెండు సంవత్సరాల్లో 11 దేశాల అధ్యక్షులు, 7 దేశాల ఉపాధ్యక్షులు, 8మంది ప్రధాన మంత్రులతో సమావేశమయ్యారు. 238రోజుల పాటు రాజ్యసభ కార్యకలాపాలు నిర్వహించారు. కోస్టారికాలో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో నడుస్తున్న ‘యూనివర్శిటీ ఆఫ్ పీస్’ నుండి గౌరవ డాక్టరేట్‌ను అందుకున్న తొలి భారతీయునిగా ఖ్యాతిగాంచారు.

### రైతన్నలతో ముఖాముఖీ చర్చలు...

స్వతహాగా రైతుబిడ్డ కావడంతో దేశానికి అన్నం పెట్టే రైతన్నల సంక్షేమాన్ని కాంక్షిస్తూ.. రైతులను స్వయంగా కలుసుకుని వారితో ముఖాముఖీ చర్చించి, వారి సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారాలకు మార్గాలను సూచించడం వెంకయ్యానాయుడుకు ఎంతో ఇష్టం. రైతులకు సంబంధించి, వ్యవసాయపరమైన విద్యాలయాలు, పరిశోధక సంస్థల్లో కూడా ఆయన తన ప్రసంగాలు చేశారు. రైతులకు మేలు చేసే ఎన్నో ఆలోచనలు వారికి అందించి రైతులకు అత్యంత ఆత్మీయమైన మిత్రునిగా ఖ్యాతిగడించారు.



### 19 దేశాల్లో పర్యటనలు...

అంతేకాదు, ఈ రెండేళ్ళలో 19 దేశాల్లో పర్యటించి ఆయా దేశాల్లో మనదేశానికి సుహృద్భావపూరితమైన.. దౌత్యపరమైన సంబంధాలను మరింతగా దృఢతరం చేసేలా తనవంతు కృషి చేశారు. పలు దేశాలతో పాటు పనామా, గ్వాటిమాలా, కోస్టారికా, మాల్టా దేశాల్లో పర్యటించిన తొలి భారత ఉపరాష్ట్రపతిగా వెంకయ్యానాయుడు అందరి ప్రశంసలు అందుకున్నారు. అన్నిటికన్నా ముఖ్యంగా...1893లో చికాగోలో స్వామీ వివేకానంద భారతీయులందరూ గర్వించేలా ఎంతో చరిత్రాత్మకమైన ప్రసంగం చేసిన ఫుల్లర్‌టన్ హాల్‌ను కూడా సందర్శించి.. భారత ఉపరాష్ట్రపతిగా వెంకయ్యానాయుడు అదే వేదికపై ప్రసంగించడం మరో అద్భుతమైన విశేషం. ఇలాంటి అపురూపమైన విషయాల సమగ్ర సమాచార మాలికే..ఈ పుస్తకం.

### ఈ పుస్తకంలోని ప్రతిమాటా.. ఒక మణిపూస...

ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు పాల్గొన్న ప్రతి కార్యక్రమాన్ని ఎంతో నిబద్ధతతో అక్షరబద్ధం చేసి, ప్రతి అక్షరం ఒక అనర్ఘరత్నంగా భావించి, ప్రతి మాటా ఒక మణిపూసగా పొందికగా అమర్చి.. అపురూపమైన ఛాయాచిత్రాలతో సహా అన్నిటినీ అత్యంత సుందరమైన రీతిలో పొందుపరచిన ఈ 257 పేజీల పుస్తకం..చదువరుల మస్తకాల్లో ఇట్టే నిలచిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వ సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని బిఓసి సంస్థ ముద్రించింది.

దేశభవితను మనసారా ఆకాంక్షిస్తూ.. జాతికి సరైన దశ-దిశా నిర్ధేశంచేస్తూ.. వెంకయ్యానాయుడు మదిలోని ఎన్నెన్నో గొప్ప ఆలోచనల సమాహారమే ఈ పుస్తకం. నవభారత నిర్మాణమే ధ్యేయంగా, భరతమాత ముద్దుబిడ్డగా.. భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడి అలుపెరుగని కార్యదీక్షాదక్షతలకు.. ఈ పుస్తకం ఒక దర్పణం. దేశ భవితకోసం ఉవ్విళ్ళూరే దేశభక్తులకు.. విద్యావంతులకు, విజ్ఞానవేత్తలకు, యువతకు... ప్రతిఒక్కరికీ ఈ పుస్తకం.. సరైన మార్గదర్శకం!..

ప్రాచీనకాలంలో మహర్షులు బోధించిన విధంగా మన దేశ ఔన్నత్యం కోసం పాటుపడాలి. సత్యధర్మాలను తప్పకుండా పాటించాలి. శాంతి సామరస్యాలకు ఆలవాలమైన మన సంప్రదాయాలను గౌరవించుకోవాలి. ముఖ్యంగా మనకు ప్రాణమిచ్చే ప్రకృతిని పరిరక్షించుకోవాలి. పర్యావరణాన్ని పరిశుభ్రతను ఎల్లవేళలా కాపాడుకోవాలి.



### ‘రత్నం’కీ స్థానం

నెల్లూరులోని రత్నం స్కూల్ విద్యార్థులతో ముచ్చటించి... ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలని, విద్యతోనే సమాజంలో ఉన్నతస్థాయి సాధించవచ్చని ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. ఇంతటి అపురూపమైన పుస్తకంలో మన ‘రత్నం’కీ స్థానం లభించడం నెల్లూరీయులకు గర్వకారణం.

## 'ప్రభా'తం

జమ్మూ-కాశ్మీర్‌కు ఆర్టికల్ 370ని తొలగించడాన్ని ఈ ప్రపంచంలో ముగ్గురే ముగ్గురు వ్యతిరేకించారు. ఒకటి పాకిస్థాన్, రెండోది చైనా, మూడోది మన దేశంలోని కాంగ్రెస్‌పార్టీ. పాకిస్థాన్ వ్యతిరేకించిందంటే అర్థముంది. చైనా దానికి మద్దతు పలికిందంటే దాని మిత్రదేశం కాబట్టి దానికీ ఒక అర్థముంది. మరి కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకించిందన్నది ఈ దేశ ప్రజలకు అర్థం కావడం లేదు. బహుశా చైనా, పాక్, ఇండియన్ కాంగ్రెస్‌ది త్రిముఖ స్నేహసంబంధమనుకోవాలి. ఎందుకంటే కాంగ్రెస్ హయాంలోనే కదా మన దేశంలోని కొంత భూభాగాన్ని చైనాకు వదులుకుంది, పిఓకేను పాకిస్థాన్ ఆక్రమించుకోగలిగింది. కాంగ్రెస్ హయాంలో మన విదేశాంగ విధానం కూడా అత్యంత లోపభూయిష్టంగా వుండేది. ఎక్కువ దేశాలను శత్రువులుగా మార్చుకున్నది కూడా అప్పుడే!

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం విదేశాంగ విధానంలో అత్యంత విజయవంతంగా వ్యవహరించింది. గత ఐదేళ్లలో ప్రధాని నరేంద్ర మోడీ నడిపిన దౌత్య రాజకీయాల మూలంగా ఎన్నో దేశాలు మనకు దగ్గరయ్యాయి. శత్రుదేశాలను సైతం దగ్గర చేసుకోగలిగాము. ఎన్నో అంశాలకు అంతర్జాతీయంగా భారత్‌కు మద్దతు లభించింది. చివరకు పాకిస్థాన్-చైనాలు కలిసి కుట్రపన్ని భారత్‌ను ఏకాకిగా మార్చాలని చెప్పి ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలోనూ భద్రతా మండలి సభ్యదేశాలు భారత్‌కు బాసటగా నిలవడం మోడీ దౌత్యనీతి ఫలితమే!

### మోడీ తిరుగుడు ఉపయోగపడింది



ప్రధాని నరేంద్ర మోడీ గత ఐదేళ్లలో ఎన్నో దేశాలలో పర్యటించాడు. వాటిలో చిన్న దేశాలున్నాయి, పెద్ద దేశాలున్నాయి. అన్ని దేశాలతోనూ స్నేహహస్తం చాచాడు. ఉగ్రవాదంపై పోరులో అన్ని దేశాలను భాగస్వామ్యులను చేశాడు. ముస్లిం ఆధిపత్యం వుండే గల్ఫ్ దేశాలు సైతం కాశ్మీర్ విషయంలో మోడీకే మద్దతుగా నిలిచాయి. ఈరోజు ఉగ్రవాదమైనా, కాశ్మీర్ వివాదమైనా ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు బాసటగా నిలుస్తున్నాయంటే కారణం అంతర్జాతీయంగా మోడీ నెరపిన సంబంధాలే!

జమ్మూ-కాశ్మీర్‌కు స్వయంప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని తొలగిస్తే మూడో ప్రపంచయుద్ధం తప్పదన్నంతగా 70ఏళ్ళుగా కాంగ్రెస్‌పార్టీ భయపెడుతూ వచ్చింది. వాళ్ళు 70ఏళ్ళు భయపడుతూ, భయపెడుతూ దాని జోలికే వెళ్ళలేదు. కాని, కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన 70రోజుల్లోనే నరేంద్ర మోడీ ఆర్టికల్ 370ని రద్దు చేసేశాడు. అది కూడా చాలా సులభంగా, పద్ధతిగా చేశాడు. ఇంత సులభంగా దానిని రద్దు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ వాళ్ళు జీర్ణించుకోలేకపోతున్నారు. ముఖ్యంగా ఆర్టికల్ 370ని రద్దు చేశాక కూడా దేశంలో ఎలాంటి అల్లర్లు తలెత్తకుండా సాధారణ పరిస్థితులు నెలకొని వుండడాన్ని ఇద్దరు జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకరు పాకిస్థాన్ అయితే, రెండోది ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకించిన బీజేపీ బద్ధ వ్యతిరేకి కాంగ్రెస్, దాని అనుకూల పక్షాలు. కాశ్మీర్ విషయంలో రాజకీయంగా కాంగ్రెస్ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. దేశ ప్రజల దృష్టిలో విలన్‌గా మారింది. కాశ్మీర్ విషయంగా జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అభాసుపాలైతే అంతర్జాతీయంగా పాకిస్థాన్ అభాసుపాలైంది. ఆ దేశానికి అవమానమే మిగిలింది.

జమ్మూ-కాశ్మీర్‌కు ఆర్టికల్ 370ని రద్దు చేశాక భారత్‌లో ఎలాంటి అలజడులు తలెత్తకపోవడం పాకిస్థాన్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. దీంతో అంతర్జాతీయంగా పంచాయితీ పెట్టి ఈ విషయంలో భారత్‌ను ఏకాకిని చేయాలనుకుంది. కాబట్టే తనకు బిస్కెట్లు వేసే చైనాకు తమ బాధను చెప్పుకుంది. ఆసియా ఖండంలో భారత్ ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికి పాకిస్థాన్‌ను చైనా పెంచిపోషిస్తోంది. పాకిస్థాన్ కన్నీళ్లు తుడవాలి కాబట్టి ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి సమావేశానికి బాటలు వేసింది. పాకిస్థాన్ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ అయితే కాశ్మీర్ విషయంలో అమెరికా మధ్యవర్తిత్వాన్ని ఆశిస్తున్నట్లు ప్రకటనలు చేశాడు. కాశ్మీర్ విషయంలో అమెరికా తమకు మద్దతుగా నిలుస్తుందేమోనని ఆశపడ్డాడు. భద్రతా మండలిలో ఐదు శాశ్వత సభ్యదేశాలు, పది తాత్కాలిక సభ్య దేశాలుండగా ఒక్క చైనా తప్పితే ఇక ఏ దేశం కూడా పాకిస్థాన్‌కు మద్దతుగా రాలేదు. మెజార్టీ దేశాలు దీనిని ద్వైపాక్షిక సమస్యగానే పరిగణించాయి. ఈ సమావేశంపై ఎటువంటి ప్రకటన వెలువడకపోవడం పాకిస్థాన్‌కు చెంపపెట్టుగా మారింది.

ప్రధాని నరేంద్ర మోడీ గత ఐదేళ్లలో ఎన్నో దేశాలలో పర్యటించాడు. వాటిలో చిన్న దేశాలున్నాయి, పెద్ద దేశాలున్నాయి. అన్ని దేశాలతోనూ స్నేహహస్తం చాచాడు. ఉగ్రవాదంపై పోరులో అన్ని దేశాలను భాగస్వామ్యులను చేశాడు. ముస్లిం ఆధిపత్యం వుండే గల్ఫ్ దేశాలు సైతం కాశ్మీర్ విషయంలో మోడీకే మద్దతుగా నిలిచాయి. ఈరోజు ఉగ్రవాదమైనా, కాశ్మీర్ వివాదమైనా ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు బాసటగా నిలుస్తున్నాయంటే కారణం అంతర్జాతీయంగా మోడీ నెరపిన సంబంధాలే! పుల్వామా దాడి నేపథ్యంలో పాక్‌లోని ఉగ్ర శిబిరాలపై భారత వాయుసేన జరిపిన దాడులను కూడా ప్రపంచ దేశాలు సమర్ధించాయంటే కారణం ప్రపంచ దేశాల దృష్టిలో భారత్ పట్ల గౌరవభావం పెరగడం వల్లే!

ఆర్టికల్ 370 విషయాన్ని ఎన్డీఏ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదు. కాంగ్రెస్‌వాళ్ళు కాశ్మీర్‌ను ఇంతకాలం ఒక ద్వైపాక్షిక సమస్యగా మిగిల్చారు. ఎన్డీఏ ప్రభుత్వం కాశ్మీర్‌ను దేశంలోని మిగతా రాష్ట్రాల మాదిరిగానే అది కూడా ఒక రాష్ట్రం అనే వాతావరణాన్ని తీసుకు వచ్చింది. ఇప్పుడు ఎన్డీఏ టార్గెట్ పాక్ ఆక్రమిత కాశ్మీర్. భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఇప్పటికే ఈ విషయాన్ని స్పష్టంగా ప్రకటించారు. పిఓకెలోని ప్రజలు కూడా తమను భారత్‌లో కలపాలని ఉద్యమాలు చేస్తున్నారు. భారత్ ఇప్పుడిప్పుడే పిఓకెను స్వాధీనం చేసుకోకపోవచ్చు. కాని, బీజేపీ అన్నది అధికారంలో వుంటే, మోడీ ప్రధానిగా వుంటే పిఓకెను ఏదో ఒకరోజు భారత్‌లో విలీనం చేయడం ఖాయం.

---

## భక్తిశ్రద్ధలతో..
## శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవం

నెల్లూరులోని మండపాలవీధిలో ఉన్న శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో ఈనెల 17వ తేదీన స్వామివారి 348వ ఆరాధనోత్సవం ఎంతో భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆరాధనలో భాగంగా రెండవరోజు జరిగిన ఈ కార్యక్రమంలో 108 సుశమీంద్రతీర్థస్వామిజీ ఆశీస్సులతో జరుగుతున్న ఈ ఆరాధనోత్సవంలో శ్రీ రాఘవేంద్రస్వామికి ఉదయం సహస్ర శంఖాలతో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి మూడు అవతారాలైన ప్రహల్లా రాయలు, వ్యాసరాయలు, శ్రీ రాఘవేంద్రస్వామిల అలంకారాలను శోభాయమానంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. శ్రీ రాఘవేంద్రస్వామి నామస్మరణలతో ఆలయప్రాంతం మార్మోగింది. అనంతరం పరమాదేవి శిష్యబృందంచే వీనులవిందుగా సంగీత కచ్చేరీ జరిగింది. ఆలయ ఛైర్మెన్ ఎన్.జనార్ధన్‌రావు, గురుచరణ్ తదితరులు పర్యవేక్షించారు.

## మొక్కలు నాటి.. అభిమానం చాటారు

మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకల్లో భాగంగా 19వ తేదీ చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నెల్లూరులో మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.

నెల్లూరు, బాలాజీనగర్‌లోని నలంద స్కూల్లో చేపట్టిన ఈ కార్యక్రమానికి నెల్లూరు డివిజన్ అటవీశాఖ అధికారి ఎస్.రవిశంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిరంజీవి యువతతో కలిసి స్కూల్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. విద్యార్థులకు వెయ్యి మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అటవీ అధికారి రవిశంకర్ మాట్లాడుతూ చిరంజీవి అభిమానులు చిరంజీవి యువత పేరుతో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం ఆదర్శనీయమని, ప్రతిఒక్కరూ మొక్కలు పెంచడాన్ని తమ ధర్మంగా భావించాలని ఆయన పేర్కొన్నారు. చిరంజీవి యువత రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చిరంజీవి జన్మదిన వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మెగా కుటుంబ అభిమానులు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. సేవా కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి, రవికుమార్, వేణు, కిషోర్, శేషయ్య, సాయి, రవి, హనుమంతరావు, రవిశంకర్ రమేష్, మహేంద్ర, చరణ్, జగన్ పాల్గొన్నారు.

---




## కాంగ్రెస్ బుద్ధి ఇక మారదు?

దేశ భద్రత, ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ పార్టీ తన బుద్ధిని ఇప్పటికీ మార్చుకోకపోవడం శోచనీయం. తేది.16.08.2019 'లాయర్' సంచికలో "పతనం నుండి కోలుకునేనా?" సంపాదకీయంలో పేర్కొన్నట్లు కాంగ్రెస్ పతనం వైపు వేగంగా అడుగులు వేస్తోంది. దేశ ప్రయోజనాలకంటే కులాల వారీగా, మతాల వారీగా వ్యక్తిగత ప్రయోజనాల కోసమే ఆ పార్టీ పెద్దపీట వేస్తోంది. బ్రిటీష్ వాడి విభజించు పాలించు సిద్ధాంతాన్నే కాంగ్రెస్ ఇంతకాలం అనుసరించింది. దేశంలోని ప్రజలను కులాలు, మతాల వారీగా విడదీసి వారిని ఓట్ల బ్యాంకుగా మార్చుకుని ఇన్ని దశాబ్దాలుగా అధికారం చెలాయించింది. దేశ భద్రత దృష్ట్యా ఆర్టికల్ 370ని ఎత్తి వేస్తే కేంద్రంలోని బీజేపీకి దేశవ్యాప్తంగా మెజార్టీ ప్రజలు మద్దతు పలికారు. కాని, కాంగ్రెస్ మాత్రం ఓట్ల కక్కుర్తితో దానిని వ్యతిరేకించింది. నెహ్రూ చేసిన ఛండాలాన్ని కడుక్కోవడానికి ఇన్నేళ్ళు పట్టింది. ప్రజల్లో మార్పు వచ్చింది. దేశ భద్రత విషయంలో కాంగ్రెస్‌ను నమ్మే రోజులు పోయాయి. ఇక ఆ పార్టీ చరిత్రగర్భంలో కలిసిపోవాల్సిందే!

**సి.రాజీవి, నెల్లూరు.**

## కరకట్ట కొంప
## అందుకే ఖాళీ చేయమంది

కృష్ణా నది కరకట్ట మీద అక్రమంగా కట్టిన కొంపలో చంద్రబాబునాయుడు సీఎం హోదాలో ఐదేళ్ళు నివాసమున్నాడు. ఆయన హయాంలో కృష్ణా నదికి ప్రవాహం లేదు కాబట్టి కరకట్ట అక్రమకట్టడాలు ఎంత ప్రమాదకరమో తెలియలేదు. వైసిపి అధికారంలోకి రాగానే కరకట్ట మీద అక్రమ నిర్మాణాలను ఎందుకు తొలగించాలనుకుందో ఇప్పుడు వచ్చిన వరదలతో అందరికీ అర్థమైవుంటుంది. కృష్ణా నది వరదప్రవాహంలో చంద్రబాబు అక్రమ నివాసం కూడా మునిగిపోయింది. చంద్రబాబు అక్రమ కొంపను కూల్చాలనుకోవడం అన్యాయమని ఆక్రోశించిన వాళ్ళు ఇప్పుడొచ్చిన వరదల్ని చూసైనా బుద్ధి తెచ్చుకోవాలి.

***గాలిబోయిన మురళి, కోవూరు.***

## ప్రజానేత ఆదాల

నెల్లూరు లోక్‌సభ సభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి జిల్లాకు సంబంధించిన పలు సమస్యలను లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి వాటి పరిష్కారానికి ప్రభుత్వం నుండి హామీ పొందడం సింహపురివాసులందరికీ సంతోషదాయకం. ఆదాల ఎంపీగా ఎన్నికై తొలి సమావేశాలలోనే జిల్లా ప్రజల గళాన్ని వినిపించడం అభినందనీయం. జిల్లాలో ఆమంచర్ల క్రీడా కాంప్లెక్స్ నిర్మాణం నిలిచిపోవడం, కావలి, నెల్లూరులలో సెంట్రల్ స్కూళ్ళ ఏర్పాటు ఆలస్యం కావడంతో పాటు బిట్రగుంటలో కోట్లాదిరూపాయల రైల్వే ఆస్తులు నిరర్ధకంగా పడిపోయివుండడం, జిల్లా గ్రామీణ రోడ్లు అధ్వాన్నంగా వున్న తీరును కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారు. అలాగే ఎంతోకాలంగా పెండింగ్‌లో వున్న రామాయపట్నం పోర్టు ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం నుండి హామీ పొందడం ఆదాలకు ప్రజా సమస్యల పట్ల వున్న శ్రద్ధకు నిదర్శనం.

***డా॥ యస్.బాబురావు, కావలి.***

## జిల్లాలో..
# 'దేశం' కోలుకునేనా...?

తెలుగుదేశం పార్టీ బలహీనంగా వుండే జిల్లాల్లో నెల్లూరొకటి. ఆ పార్టీ అధికారంలో వున్నప్పుడు కూడా ఇక్కడ బలహీనంగానే వుండేది. ఇక్కడ బేస్‌మెంటే బలహీనమనుకోవచ్చు. పార్టీకి ఈ స్థితి రావడానికి ఒకరకంగా చంద్రబాబు నాయుడినే ఒక కారణంగా చెప్పుకోవాలి. ఎందుకంటే జిల్లా కేంద్రమైన నెల్లూరు నగరంలోగాని, 2009లో కొత్త నియోజకవర్గంగా ఏర్పడ్డ నెల్లూరు రూరల్‌లో గాని పార్టీ ఎదగకపోవడానికి, వున్న పార్టీ కేడర్ నిర్వీర్యం కావడానికి ఒకరకంగా చంద్రబాబునాయుడు అనుసరించిన విధానాలే కారణం.

నిన్నటి ఎన్నికల్లోనూ జిల్లాలో తెలుగుదేశం చావుదెబ్బతినడం చూశాం. రెండు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలలో పార్టీ అభ్యర్థులు దారుణంగా ఓడిపోయారు. జిల్లా నుండి బీద రవిచంద్ర ఒక్కరే చట్ట సభల్లో ఆ పార్టీ సభ్యుడిగా వుంటున్నారు. పి.నారాయణ ఎమ్మెల్సీగా వుంటే ఆయన పదవీ కాలం అయిపోయింది. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఎమ్మెల్సీగా ఇంకా టైం వుండినా కూడా అసెంబ్లీ టిక్కెట్ ఇచ్చే ముందు ఎమ్మెల్సీకి రాజీనామా చేయడం తెలిసిందే! సోమిరెడ్డి ఎమ్మెల్సీగా వుందున్నా అసెంబ్లీలో కనీసం పార్టీ తరపున పెద్దగా గొంతన్నా వినపడుతుండేది.

తెలుగుదేశం ప్రభుత్వం పడిపోయి మూడు నెలలు కావస్తుంది. జిల్లాలో తెలుగుదేశం నాయకులు మళ్లీ కాళ్లు కూడదీసుకుని లేచే ప్రయత్నం చేస్తున్నారు. అయితే అలా లేచిన కొందరు వైసిపిలోకి పరుగులు తీస్తున్నారు. ఇంకొందరు మాత్రం ఇంకొంత కాలం వేచి చూసి పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకుందామనే ధోరణిలో వున్నారు. ఇటీవల జిల్లా పార్టీ సమన్వయ సమావేశాలకు నాయకులు బాగానే హాజరయ్యారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఇక కనపడరని భావించిన నాయకులు కూడా ఈ సమన్వయ కమిటీ సమావేశాలకు రావడం ఆశ్చర్యం కలిగించింది.

ఈ సమావేశాలలో పార్టీ నాయకత్వమంతా సమిష్టిగా వుండాలని, ప్రభుత్వంపై కలిసికట్టుగా యుద్ధం చేయాలని కూడా నిర్ణయించారు. అయితే ఇక్కడ ప్రభుత్వంపై యుద్ధం అనేసరికి పెద్దగా నాయకులు కనిపించరు. ఎంత సేపటికీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, కోటంరెడ్డి శీనయ్యలే ప్రత్యక్షమవుతుంటారు. ఎందుకంటే పార్టీలో ఫుల్ టైం పొలిటిషియన్ జాబ్ చేసే నాయకులు వాళ్ళే! చంద్రబాబు పార్టీనంతా కూడా కాంట్రాక్టర్లు, వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలతో నింపేశాడు. వాళ్ళు వాటన్నింటినీ మానుకుని పార్టీ సేవ కోసం ఫుల్‌టైం పని చేస్తారా? ఒకవేళ నెలకో రెండు నెలలకోసారి పార్టీ మీటింగ్‌లంటే వస్తారుగాని, రోడ్ల మీద ధర్నాలు, ఆందోళనలు అంటే వస్తారా? కాబట్టి పార్టీని మళ్లీ పాత బ్యాచ్ లీడర్సే లాగాలి. అయితే ఇప్పుడు పార్టీని నడపడమంటే గతంలో వున్నంత సులభంగా లేదు. వందమందితో ధర్నా చేయాలన్నా ఖర్చు కనీసం లక్ష రూపాయలు. ఈ కోణంలో చూస్తే జిల్లాలో తెలుగుదేశం తరపున ఎవరు గట్టిగా నిలబడతారు? ఎంతమేరకు పోరాటాలు చేస్తారో చూడాలి!?



## వచ్చేది.. ముంచే కాలం..
# జాగ్రత్త పడితేనే మంచికాలం

ఎండాకాలంలో బిందెడు నీళ్ళకు కూడా కష్టాలు పడుతుంటాం. వానాకాలంలో కృష్ణా, గోదావరి నదుల నుండి వేలకొద్ది టిఎంసీల నీళ్ళు సముద్రం పాలవుతున్నా చూస్తూ వుంటాం. నీటిని ఒడిసి పట్టడంపై ప్రభుత్వాలు ప్రధానంగా దృష్టి సారించాలి. దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి కాలంలో ప్రారంభించిన ఎన్నో ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లను గత ప్రభుత్వాలు సకాలంలో పూర్తి చేసుంటే ఈరోజు ఇన్ని వేల టిఎంసీల నీళ్ళు సముద్రంపాలయ్యేవి కావు.

నీళ్ల విషయంలో నెల్లూరు జిల్లా ప్రజాప్రతినిధులు ఎంతో ముందుచూపుతో వ్యవహరించాల్సిన అవసరముంది. ముఖ్యంగా జిల్లాకు చెందిన నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ జలవనరుల శాఖ మంత్రిగా వున్నాడు. నెల్లూరుజిల్లాకు ఇంకా వర్షాల సీజన్ మొదలు కాలేదు. జిల్లాలో ఇరిగేషన్ పనులపై కొంత దృష్టి పెట్టాల్సివుంది. ముఖ్యంగా గత నాలుగేళ్లుగా భారీ వర్షాలు లేక కాలువలు పిచ్చి మొక్కలు, గుర్రపుడెక్కలతో పూడిపోయి వున్నాయి. వర్షాల సమయంలో ప్రవాహానికి వీలుగా అన్ని ఇరిగేషన్ కాలువలలో పూడికలు తీయించాలి. 2015లో నెల్లూరులో వరదలకు కారణం కాలువలు పూడిపోయి వుండడమే! కాలువలపై ఆక్రమణలు తొలగించి, పూడిక తీయించాల్సివుంది. వర్షపు నీళ్ళను వృధాగా పోకుండా అలాగని వరద ప్రవాహమై చుట్టుముట్టకుండా కాలువలు, చెరువుల, కుంటల వంటివాటి పూడిక తీతపై దృష్టి పెట్టాల్సివుంది.

## నగరంలో...
# అధ్వాన్నపు రోడ్లతో.. మళ్లీ అవస్థలు



## కంకర లేచిపోతున్న రోడ్లు.. నాసిరకం నిర్మాణాలు

- టిడిపి హయాంలో ఘోరంగా జరిగిన పనులు
- రోడ్లు.. భూగర్భ డ్రైనేజీ పనులపై విజిలెన్స్ తనిఖీలు

**నెల్లూరు నగరంలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులపై విజిలెన్స్ తనిఖీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నీటి పారుదల మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్‌యాదవ్ ఫిర్యాదుకు స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ పనులపై వెంటనే సమగ్ర విచారణ జరపాలని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించడంతో అధికారులు రంగంలోకి దిగారు. నెల్లూరు నగరాన్ని సుందరనందనం చేస్తున్నామని, అత్యద్భుతంగా రోడ్లు వేయిస్తున్నామని, కలగా మిగిలిన భూగర్భడ్రైనేజీని వందలకోట్లతో చేయిస్తున్నామని.. ఇక ఇలాంటి నెల్లూరు ప్రపంచంలోనే మరెక్కడా ఉండదని నగరప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తూ.. మాయమాటలతోనే బురిడీ కొట్టించిన టిడిపి నాయకుల బండారం బయట పడబోతోంది. టిడిపి వారు అద్భుతం అని చెప్పుకున్న రోడ్లు నాణ్యతాపరంగా ఎంత 'బ్రహ్మాండంగా' ఉన్నాయో త్వరలోనే బహిర్గతం కాబోతోంది.**

గతంలో ఎవరూ చేయని విధంగా వందల కోట్ల రూపాయలతో భూగర్భ డ్రైనేజీ పనులు చేయిస్తున్నామని డంబాలు కొట్టుకున్న టిడిపి ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్లు.. ఈ కొద్దినెలల్లోనే పరమ దరిద్రంగా తయారయ్యాయి. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా తాము పనులు చేస్తున్నట్లు ప్రతినిత్యం ఊదరగొట్టిన నాయకుల అసలు బాగోతం ఇప్పుడు బయటపడుతోంది.

### కంకర లేచిపోతున్న రోడ్లు...

ఎక్కడ చూసినా తారు, కంకర లేచిపోయి.. ఈ రోడ్ల అసలు స్వరూపం వెలికివస్తోంది. తమకింక ఎదురే ముందంటూ నామమాత్రపు పనులు చేసేసి కోట్లాదిరూపాయలు బొక్కేసిన సంబంధిత నాయకులు.. వీరికి వత్తాసు పలుకుతూ అధికారదర్పంతో జనాన్ని బురిడీ కొట్టించిన నాటి అధికారగణం.. ఎప్పుడో తమ పనులన్నీ బాగా చక్కబెట్టేసుకున్నారు. ఎవరికి అందినంత వారు దోచుకు తినేశారు. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనుల్లో కోట్లాది రూపాయల అవినీతి అక్రమాలు జరుగుతున్నాయంటూ అప్పట్లో ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైకాపా నాయకులు ఎంతగా నెత్తీనోరూ బాదుకున్నా వినిపించుకునే నాధులే లేరు. ఒక పద్ధతీపాడూ లేకుండా తమ ఇష్టం వచ్చినట్లు రోడ్లన్నీ గుంతలు తవ్వేసి గబ్బుపట్టించారు. నెలల తరబడి ప్రజలకు నరకం చూపించారు.

### అస్తవ్యస్త రోడ్లపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక...

నెల్లూరు నగరంలో గత కొద్దిరోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాలకి రోడ్ల నాణ్యత ఎంత బాగుందో బయట పడుతోంది. క్రిటికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ పేరుతో నెల్లూరు నగరంలో సుమారు 338 కోట్ల రూపాయలతో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులతో పాటు పలు ప్రాంతాల్లో వేసిన సిసి రోడ్లలో నాణ్యత అన్నదే లేదు. ఇప్పుడు రోడ్లు పగుళ్ళు బారాయి, అనేక రోడ్లు కంకర లేచిపోయి మళ్లీ రోడ్లమీద గుంతలు పడుతున్నాయని, వాన నీరు.. డ్రైనేజీనీరు అంతా మళ్లీ రోడ్లమీద ఆ గుంతల్లో నిలుస్తున్నాయని జనం వాపోతున్నారు కూడా. అంతేకాదు, చేపలమార్కెట్ సమీపంలో దాదాపు రెండు కోట్ల రూపాయలతో నిర్మించిన ఎన్టీఆర్ క్లాత్‌మార్కెట్ కూడా చిన్నవానకే ఉరుస్తూ ఉందంటే నాణ్యత ప్రమాణాలను ఎవరూ పట్టించుకోలేదని తేటతెల్లమవుతోంది. ఇవన్నీ గతంలో టిడిపి నాయకుల, అధికారుల పనితీరుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

### రంగంలోకి విజిలెన్స్ అధికారులు...

ఈ నేపథ్యంలో, నెల్లూరు నగర రోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాల పనులన్నిటిపై విచారించి వెంటనే నివేదిక సమర్పించాలంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్‌శాఖను ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. విజిలెన్స్ శాఖ అడిషనల్ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, ఎస్ఇ శ్రీనివాసమూర్తి, డి.ఇ కల్యాణచక్రవర్తితో కలసి అధికారుల బృందాన్ని ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది కూడా. ఈనెల 17న ఈ ప్రత్యేకబృందం నెల్లూరు నగరానికి వచ్చి పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. నెల్లూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శ్రీకంఠనాధరెడ్డి, ప్రజారోగ్యశాఖ సాంకేతిక అధికారుల బృందం అందరూ కలసి నగరంలోని పలు రోడ్లను నిశితంగా పరిశీలిస్తున్నారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించారు. నగర రోడ్లు ఎలాంటి దుస్థితిలో ఉన్నాయో పరిశీలించారు. నెల్లూరు దర్గామిట్టలోని పోస్టల్‌కాలనీలో ఉన్న రోడ్లు, రాజరాజేశ్వరిగుడి వెనుక వున్న రోడ్లు, కెవిఆర్ మునిసిపల్ స్కూల్ రోడ్డు, నగరంలోని పప్పులవీధిలో ఉన్న రోడ్లు పరిశీలించగా అనేకచోట్ల నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే కంకర లేచిపోయిందని, రోడ్లమీద పగుళ్ళు ఏర్పడ్డాయని అధికారులు గుర్తించారు. క్వాలిటీ కంట్రోల్ అధికారులతో కూడా రోడ్లను పరీక్ష చేయించి, ప్రభుత్వానికి నివేదిక ఇచ్చేందుకు అధికారులు సమాయత్త మవుతున్నారు. నివేదిక అందగానే నాశిరకపు రోడ్ల బాధ్యులందరిపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందేమోనని సంబంధిత నాయకులు ఇప్పటినుంచే తగుజాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం.

# సాయిరెడ్డిని కలిసిన రంగారెడ్డి



విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి 19వ తేదీ హైదరాబాద్‌లో రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరుజిల్లాలో విజయ డెయిరీ పురోగతిని వివరించారు. ప్రైవేట్ డెయిరీల పోటీని తట్టుకుని నిలబడేందుకు విజయ డెయిరీలో బైప్రొడక్ట్స్‌ను ఉత్పత్తి చేయడానికి సహకరించాలని ఆయన విజయసాయిరెడ్డిని కోరడం జరిగింది.

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరు రానున్న ఏపి గవర్నర్



ఆంధ్రప్రదేశ్ గవర్నర్ భిశ్వభూషణ్ హరిచందన్ ఈ నెల 25వ తేదీ నెల్లూరుజిల్లాకు రానున్నట్లు తెలుస్తోంది. ఆరోజు నెల్లూరు, దర్గామిట్టలోని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకల్లో విశ్వవిద్యాలయం ఛాన్సలర్‌గా ఆయన పాల్గొననున్నారు. అదీగాక ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతుండడంతో గవర్నర్ పర్యటన కూడా ఖచ్చితంగా ఉంటుంది. అయితే ఆయన ఈ ఒక్క కార్యక్రమానికే వుంటాడా? లేక మరికొన్ని కార్యక్రమాల్లో ఉపరాష్ట్రపతితో కలిసి పాల్గొంటాడా? అనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు.!

# వీఆర్‌ఓల సదస్సుకు తరలిరండి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు

ఈ నెల 25వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే వీఆర్‌ఓల సదస్సుకు జిల్లాలోని వీఆర్‌ఓలంతా తరలిరావాలని వీఆర్‌ఓల సంఘం పిలుపునిచ్చింది. ఈ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఈ నెల 19న కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు పి.అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ సదస్సుకు ఉపముఖ్యమంత్రి మరియు రెవెన్యూ శాఖ మంత్రి పిల్లి సుభాష్‌చంద్రబోస్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు. వీఆర్‌ఓల సమస్యల పట్ల సానుకూలంగా స్పందిస్తున్న కలెక్టర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు డి.వి. రమణయ్య, ఏవివి ప్రసాదరావు, హజరత్తయ్య, నాగరాజు, బి.రమణయ్య, రవిశేఖర్, సర్వేశ్వరరావు, సురేంద్ర, ప్రసాద్, రమణయ్య, మీరావలి, పరిశుద్ధరావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరాభవన్‌లో రాజీవ్ జయంతి



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈ నెల 20వ తేదీన నెల్లూరులోని ఇందిరా భవన్‌లో మాజీప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ 75వ జయంతిని నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే సి.వి.శేషారెడ్డి, కాంగ్రెస్ నాయకులు భవాని నాగేంద్రప్రసాద్, రఘురాం ముదిరాజ్, ఉడతా వెంకట్రావ్, ఏటూరి శ్రీనివాసులు, టి.బాలసుధాకర్, ఫయాజ్, వింజమూరు కాలేషా, మోహన్, షబ్బీర్, లతారెడ్డి, అనురాధారెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేసి అందరికీ స్వీట్లు పంచారు. ఇందిరాభవన్‌లో మొక్కలు నాటారు.

# స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**- జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి**



ప్రతి సోమవారం ఆన్ లైన్ ద్వారా స్పందన కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తానని, అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ ఐశ్వర్యరస్తోగి ఆదేశించారు. జిల్లాలోని 64 పోలీస్‌స్టేషన్లు, 14 సర్కిల్ కార్యాలయాలు, 5 డీఎస్పీ కార్యాలయాలను జూమ్ అనే ప్రత్యేక అప్లికేషన్ ద్వారా జిల్లా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్‌కు అనుసంధానం చేశారు. ఈనెల 19న పోలీస్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ప్రతి అర్జీదారుడికి రశీదు ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని సూచించారు. అలసత్వం ప్రదర్శిస్తే వేటు తప్పదని హెచ్చరించారు. అనంతరం ఎస్పీ బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. నెల్లూరు నగర, రూరల్ డీఎస్పీలు జె.శ్రీనివాసులురెడ్డి, కేవీ రాఘవరెడ్డి, ఎస్బీ డీఎస్పీ ఎన్.కోటారెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పి. శ్రీనివాసులురెడ్డి, బి.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

# విశాఖ ఎయిర్‌పోర్ట్ జీఎం రాజ్‌కిషోర్‌కి అభినందన



సత్కారాన్నందుకుంటున్న రాజ్‌కిషోర్

విమానయాన శాఖలో చిరుద్యోగిగా చేరి స్వయం కృషితో అంచలంచెలుగా ఎదిగి నేడు విశాఖపట్నం ఎయిర్‌పోర్టుకి జనరల్ మేనేజర్‌గా నియమితుడైన నెల్లూరీయుడు రాజ్‌కిషోర్, జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా నెల్లూరుకు వచ్చిన సందర్భంగా రాజ్‌కిషోర్ మిత్రులు, ఆప్తులు ఆయనను సత్కరించుకున్నారు. పొగతోటలోని చెన్నై హాస్పిటల్స్ సమాచార కేంద్రంలో రాంజీ ఆధ్వర్యంలో జరిగిన అభినందన సత్కారంలో రాజ్‌కిషోర్ మిత్రులు, పలువురు కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజ్‌కిషోర్‌ను అభినందించిన నలుబోలు బలరామయ్యనాయుడు, యస్.వి.రమేష్, శింగంశెట్టి మురళీమోహన్ తదితరులు రాజ్‌కిషోర్ ఇంకా అత్యున్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు.

గతంలో జగన్‌పై జరిగిన దాడి కేసులో సంచలనానికి నాందిగా నిలచిన విశాఖ ఎయిర్‌పోర్ట్‌కి సమర్థవంతమైన అధికారిని నియమించాలనే దృక్పథంతో ముఖ్యమంత్రే స్వయంగా రాజ్‌కిషోర్ పేరును ప్రతిపాదించడం అభినందనీయం. ఆల్ ది బెస్ట్ టూ రాజ్‌కిషోర్.

# వీఆర్ కళాశాలలో వనం-మనం




మొక్కను నాటుతున్న వీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

వీఆర్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 17న ఎన్‌యస్‌యస్ ఆధ్వర్యంలో వనం-మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్.యం.సుబ్రహ్మణ్యం, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ యస్‌కె ఆలీమొహిద్దీన్, ఎన్‌సీసీ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ గంధం వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మొక్కలు నాటి మాట్లాడుతూ మొక్కలను మనం నాటడమే కాకుండా వాటి సంరక్షణలో అందరం బాధ్యత వహించాలన్నారు. నేటి వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మనకు చెట్లు ఎంతో అవసరమని, చెట్లు సమతుల్యతగా వుంటేనే సకాలంలో వర్షాలు పడుతాయన్నారు. వాతావరణ కాలుష్యాన్ని కూడా అరికట్ట వచ్చున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌యస్‌యస్ వాలంటీర్లు, అధ్యాపకులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

# స్వాస్టిక్ సెంటర్‌కు స్టేషనరీ విరాళం



స్టేషనరీని అందజేస్తున్న అబ్దుల్‌హమీద్, సుధాకర్

నెల్లూరులోని రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నడిచే మాగుంట సుబ్బరామిరెడ్డి స్వాస్టిక్ సెంటర్‌లోని విద్యార్థులకు ఈనెల 19న పొదలకూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్‌డి అబ్దుల్‌హమీద్, సైన్స్ ఉపాధ్యాయులు ఏ.వి.సుధాకర్‌లు డ్రాయింగ్‌బాక్స్‌లను, చాక్పీస్ బోర్డులను అందజేశారు. వారికి సంస్థ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సెంటర్ కన్వీనర్ బి.మనోహర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గుర్నాధం, వైస్‌ప్రిన్సిపాల్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

# రొట్టెల పండుగను విజయవంతం చేయాలి

సెప్టెంబర్ 10వతేదీ నుంచి 4రోజుల పాటు జరిగే రొట్టెల పండుగను అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని నెల్లూరు మునిసిపల్ కమిషనర్ పీవీవీయస్ మూర్తి పేర్కొన్నారు. ఈనెల 19న నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో పోలీస్, ఫైర్, నుడా, వక్ఫ్ బోర్డు, కార్పొరేషన్ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులు కల్పించాలని, ఉద్యోగులు, సిబ్బంది 24 గంటలు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్‌కు స్థలాలు గుర్తించి మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. ఇంజనీరింగ్ ఎస్‌ఈ ఇమాంమొహిద్దీన్, నుడా వైస్‌ఛైర్మన్ బాపిరెడ్డి, పోలీస్, వక్ఫ్ బోర్డు అధికారులు పాల్గొన్నారు.

# విశాలాక్షికి... విదేశీ పురస్కారం



విశాలాక్షి వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు కోసూరు రత్నంకు గ్లోబల్ అచీవర్స్ ఫౌండేషన్ అంతర్జాతీయ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల 28న బ్యాంకాక్‌లో జరిగే కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారం అందుకోనున్నారు. గత 15ఏళ్లుగా వృద్ధాశ్రమం ద్వారా అనాథ వృద్ధులకు ఆయన అందిస్తున్న సేవలను దృష్టిలో వుంచుకుని ఈ పురస్కారానికి ఎంపిక చేశారు.

# 24 నుండి ఇస్కాన్‌లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

నెల్లూరు కొండాయపాలెం రోడ్డులోని అంతర్జాతీయ శ్రీకృష్ణ చైతన్య సంఘం(ఇస్కాన్) ఆధ్వర్యంలో ఇస్కాన్ మందిరంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. 24 వ తేది శనివారం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు శ్రీ రాధాకృష్ణుల అభిషేక మహోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుండి 8.30 గంటల వరకు భజన కీర్తనలు, ఊయలలో బాలకృష్ణుడు, శ్రీకృష్ణ జన్మాష్టమి స్మారక ఆవిష్కరణ, మహా హారతి, 108 వంటకాలతో నివేదన తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. 25వ తేది ఆదివారం ఉదయం 10 గంటల నుండి 1 గంట వరకు భజన కీర్తనలు, శ్రీలప్రభుపాద అభిషేకము, 56 వంటకాలతో నివేదన, శ్రీలప్రభుపాద పుష్పాంజలి, భోజన ప్రసాదాలు తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించి, స్వామి వారి కరుణా కటాక్షాలకు పాత్రులుకావలెనని మందిర అధ్యక్షులు డాక్టర్ శుకదేవస్వామి కోరారు.



# వలంటీర్లే.. వారధులు.. పథకాలకి సారధులు!

**- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి**

గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థతో నిరుద్యోగ సమస్య మటుమాయం అవుతుందని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. నెల్లూరు రూరల్‌లోని జిపిఆర్ కల్యాణ మండపంలో రూరల్ ఎమ్మెల్యే కార్యాలయం ఇన్‌ఛార్జి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 17న జరిగిన కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటుచేసి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించారని ప్రశంసించారు. వలంటీర్లు అవినీతికి తావు లేకుండా ప్రజలకు మంచి పాలనను అందించాని, ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉంటూ ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటిని పరిష్కరించేందుకు కృషిచేయాలని ఆయన అన్నారు. కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థ రూపకల్పన దేశచరిత్రలోనే అద్వితీయమైనదన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర కార్యదర్శి ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు కొండ్రెడ్డి రంగారెడ్డి, రూప్‌కుమార్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, మల్లు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**- జిల్లా కలెక్టర్ యంవీ శేషగిరిబాబు**



మొక్కలు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ఎంవి శేషగిరిబాబు

వృక్షాలను రక్షిస్తే అవి మానవజాతిని రక్షిస్తాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ యంవీ శేషగిరిబాబు పేర్కొన్నారు. ఈనెల 18న నెల్లూరు దర్గామిట్టలోని యంజీబీ ఫెసిలిటీ మాల్‌లో లక్ష మొక్కల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చే మార్పులపై అవగాహన పెంచుకొని, ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించుకోవాలని సూచించారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ యస్.రవిశంకర్ మాట్లాడుతూ ఒక్క మొక్కను పెంచడం వల్ల 20 మందికి ఆక్సిజన్ అందిస్తుందన్నారు. యంజీబీ ఫెసిలిటీ మాల్ అధినేత యంఆర్ గంగాధర్ మాట్లాడుతూ తమ సంస్థ 90 ఏళ్ళుగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. అనంతరం వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు మొక్కలను పంపిణీ చేశారు. యంజీ బ్రదర్స్ యండీ రాఘవేంద్ర, జేఎండి గోపాలకృష్ణ కొండా బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులో మూడురోజులు వెంకయ్య పర్యటన



భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు మూడు రోజుల పాటు ఈ నెల 24, 25, 26తేదీల్లో తనకెంతో ఇష్టమైన జన్మభూమి నెల్లూరుజిల్లాలో జరిగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో చెన్నైకు చేరుకుంటారు. అక్కడి నుండి హెలికాప్టర్ లో మధాహ్నం 1.30 గంటలకు నెల్లూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్ వచ్చి సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నగర్‌లోని తన నివాసానికి వెళతారు. సాయంత్రం వరకూ విశ్రాంతి తీసుకుని అక్కడి నుండి వెంకటాచలం రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారు. అక్కడి నుండి ప్రత్యేక రైలులో కృష్ణపట్నం – ఓబులవారి పల్లె రైల్వే ట్రాక్‌పై చెర్లోపల్లి వరకు వెళ్లి రైల్వే టన్నెల్ పనులను పరిశీలిస్తారు. తిరిగి అదే రైలులో వెంకటాచలం చేరుకుని, అక్కడున్న తన మూడోబిడ్డలాంటి స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆరోజు రాత్రి బస చేస్తారు. 25వ తేదీ ఉదయం 10.30 గంట లకు రోడ్డు మార్గాన గూడూరు రైల్వేస్టేషన్‌కు చేరుకుని గూడూరు–విజయవాడ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించ నున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు నెల్లూరు చేరుకుని కస్తూర్బా కళాక్షేత్రంలో జరిగే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ వేడుకల్లో పాల్గొంటారు.

### ఉపరాష్ట్రపతితో ఉపాహారం ఆత్మీయ సమావేశం

25వ తేదీ సాయంత్రం 4 గంటలకు నెల్లూరు కనుపర్తిపాడులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో 'ఉపరాష్ట్రపతితో ఉపాహారం' పేరిట వెంకయ్యనాయుడు గారి ఆప్తులు, ఆత్మీయులు, అత్యంత సన్నిహితులతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశం నిర్వహణ కోసం ఓ కమిటీ కూడా ఏర్పాటు చేయగా, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, స్వర్ణభారత్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపా వెంకట్‌లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్నారు. ఆహ్వాన పత్రిక వున్నవారిని మాత్రమే ఈ సమావేశానికి అనుమతిస్తారు.

అనంతరం వెంకయ్య సర్దార్‌పటేల్ నగర్‌లోని తన నివాసానికి చేరుకుని రాత్రికి అక్కడే బసచేస్తారు.

26వ తేదీ ఉదయం 9.30గంటలకు కొడవలూరు మండలం బొడ్డువారిపాళెంకు చేరుకుని అక్కడ నూతనంగా ఏర్పాటు కానున్న మిశ్రధాతు నిగం లిమిటెడ్ గ్రీన్‌ఫీల్డ్ అల్యూమినియం అల్లాయ్ పరిశ్రమకు శంకుస్థాపన చేస్తారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం నెల్లూరులోని పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో విజయవాడ బయలుదేరి వెళ్తారు. వెంకయ్యనాయుడు పర్యటన ఖరారైన నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.వి.శేషగిరిబాబు, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి పూర్తిస్థాయిలో సమీక్షిస్తున్నారు.

# చుక్ చుక్ బండి... పట్టాలెక్కనుందండి!

### ఈనెల 25న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్న గూడూరు - విజయవాడ ఇంటర్ సిటీ ఎక్స్ ప్రెస్



రైల్వే శాఖా పరంగా నెల్లూరుజిల్లాకు భారత ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ఇచ్చిన ఒక వరం గూడూరు – విజయవాడల మధ్య ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్. ఇప్పటికే గూడూరు – సికింద్రాబాద్ మధ్య నడిచే సింహపురి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉండగా, నవ్యాంధ్ర రాజధాని అమరావతికి సులభవంగా వెళ్లే విధంగా గూడూరు – విజయవాడ మధ్య ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు సిద్ధమైంది. ఈనెల 25వ తేదీన గూడూరు రైల్వే జంక్షన్‌లో భారత ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఈ నూతన ఎక్స్ ప్రెస్ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. గతంలో నెల్లూరు నుండి ఏ రైలు కూడా ఉండేది కాదు. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాజధాని హైదరాబాద్‌కు జిల్లా వాసులు వెళ్లాలంటే ఇతర ప్రాంతాల నుండి వచ్చే రైళ్లనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది. రిజర్వేషన్లు సరిగా దొరికేవి కాదు. ఈ నేపథ్యంలో కొన్నేళ్ళ క్రితం గూడూరు – సికింద్రాబాద్ మధ్య నెల్లూరు పేరుతోనే సింహపురి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు మంజూరై జిల్లా వాసుల ప్రయాణ కష్టాలను కొంత వరకు తీర్చింది.

రాష్ట్ర విభజన తర్వాత విజయవాడ కేంద్రంగా రాజధాని ఏర్పడడంతో నెల్లూరు ప్రాంతం నుండి అక్కడికి రాకపోకలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ఉదయం అక్కడికి వెళ్లడానికి, సాయంత్రం అక్కడ నుండి తిరిగి రావడానికి అనువుగా ఒక రైలు వుంటే బుగుంటుందనే నెల్లూరు వాసుల అభిప్రాయాన్ని వెంకయ్యనాయుడు కొన్ని నెలల క్రితం రైల్వేశాఖ మంత్రిగా వున్న పియూష్‌గోయల్ దృష్టికి తీసుకెళ్ళారు. వెంకయ్య అడిగిందే తడవుగా ఆయన గూడూరు – విజయవాడల మధ్య ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్‌ను మంజూరు చేశారు. ఈ రైలు బోగీలు ఇటీవలే విజయవాడకు చేరుకున్నాయి. ఎంతో అధునాతనంగా రూపుదిద్దుకున్న ఈ రైలు ప్రతిరోజూ గూడూరులో ఉదయం 6.10 నిముషాలకు బయలుదేరి ఉదయం 10.30 నిముషాలకు విజయవాడ చేరుకుంటుంది. మధ్యలో నెల్లూరు, కావలి, శింగరాయకొండ, ఒంగోలు, చీరాల, బాపట్ల, తెనాలి స్టేషన్లలో స్టాపింగ్ ఉంటుంది. తర్వాత సాయంత్రం 6గంటలకు విజయవాడలో బయలుదేరి రాత్రి10.40 నిముషాలకు గూడూరుకు చేరుకుంటుంది.

# మళ్లీ... ముదిరిన దోమలు



నెల్లూరంటే మొలగొలుకుల బియ్యం, చేపల పులుసుకే కాదు... తెగబలిసిన ముదురు దోమలకు కూడా ప్రసిద్ధి. నెల్లూరులో కనిపించే రాకాసి దోమలు అమెజాన్, ఆఫ్రికా అడవుల్లో కూడా ఉండవేమో! నెల్లూరీయులకు ముదురుదోమల బెడత ఏళ్లతరబడి వారసత్వంగా వస్తోంది. నగరంలోని ఇళ్ళల్లో కేవలం దోమల నిర్మూలన కోసమే అంటే ఎలక్ట్రికల్ బ్యాట్ల కొనుగోలు, ఆలౌట్, కాయల్స్ వంటి వాటికి కోట్లు ఖర్చుపెడతారంటే ఆశ్చర్యపోక తప్పదు.

ఒక అంచనా ప్రకారం చూస్తే పాము కాటుకంటే కూడా దోమ పోటు ప్రమాదకరం. ఈరోజు ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నది దోమకాటు వల్లే! పాము లెక్కడో పొల్లాల్లో, చెత్తా చెదారాలలో వుంటాయి. చాలా తక్కువుగా మనుషులు పాము కాటుకు గురవుతుంటారు, కాని దోమలు అలా కాదు. మన ఇళ్లల్లో పెంపుడు కుక్కల మాదిరిగా పెరుగుతుంటాయి. మన రక్తాన్నే తాగుతుంటాయి. వీటి కాటు వల్లే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి విషజ్వరాల బారినపడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

ఈమధ్యంతా కాసిన ఎండల దెబ్బకు ఇటీవలదాకా నెల్లూరులో దోమలు బాగా తగ్గాయి. అయితే ఇప్పుడు నాలుగు చినుకులు పడ్డాయో లేదో అప్పుడే దోమలు విజృంభించాయి. నగరంలోని అన్ని ప్రాంతాలలోనూ దోమల బెడద అధికమైంది. నగరంలోని అన్ని మురికి కాలువల్లో మురికి పేరుకుపోయింది. భారీ వర్షాలు లేకపోవడంతో ఆ మురికి కొట్టుకుపోలేదు. ఈ మురికి కూపాలే దోమల ఉత్పత్తికేంద్రాలవుతున్నాయి. నెల్లూరులో వర్షాలు కురిస్తే దోమలు విజృంభిస్తాయి. ఇక విషజ్వరాలు ఒక సంప్రదాయం మాదిరిగా ముసురుకుంటాయి. నగరంలోని ఆసుపత్రులు విషజ్వర పీడితులతో కిటకిటలాడుతుంటాయి. కాబట్టి వైద్య ఆరోగ్య శాఖాధికారులు నగర ప్రజలను విషజ్వరాల గురించి ముందే అప్రమత్తం చేయడం మంచిది.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



### విద్యానగర్‌లో..

## ఉచిత నేత్ర వైద్య చికిత్సలు




నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్ ఎన్‌బికెఆర్ ఐయస్‌టీలో గునపాడు గ్రామ సభ్యులకు ఈనెల18న ఉచిత నేత్ర, వైద్య చికిత్సలను ఐ క్రాస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 40మందికి డా. ఆలీ వైద్య పరీక్షలు నిర్వహించగా, డా. శ్రీనివాసులు 81మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇసీఎఫ్ డిప్యూటి ఛైర్మన్ ధీరజ్, సభ్యులు లక్ష్మీ ప్రసన్న,కుమార్, సునీల్, పవన్, భార్గవి, హర్షిణి తదితర సభ్యులు మాట్లాడుతూ కళాశాల డైరెక్టర్ డా. వి. విజయ్‌కుమార్‌రెడ్డి, ఇసిఎఫ్ ఫ్యాకల్టీ ఇన్ చార్జ్ ఎ. రాజశేఖర్ ప్రోత్సహంతో మరెన్నో కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

### జయభారత్‌లో...

## 'సంజీవని' వైద్యపథకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ సుకుమార్

నెల్లూరు నగరంలోని జయ భారత్ ఆసుపత్రిలో కొత్తగా ఈనెల 18న 'సంజీవని' అనే పేరుతో వైద్య పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద దాతల సహాయంతో పేద రోగులకు ఉచితంగా వైద్యసేవలందిస్తారు. ఈ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో అఖిలభారత సంఘటనా కార్యదర్శి డాక్టర్ సుకుమార్(నాగ్‌పూర్) ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పేదలు, మధ్యతరగతి రోగులకు జయభారత్ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్యాన్ని అందించాలనే ఉద్దేశ్యంతో ఆసుపత్రివారు తమ సేవలను విస్తృతం చేస్తుండడం సంతోషదాయకమన్నారు. ఈ పథకంలో శాశ్వత సభ్యత్వం తీసుకునేందుకు ఒకటిన్నర లక్షల రూపాయలు విరాళంగా ఇవ్వాల్సివుంటుందని, దీనిద్వారా ఏడాదిలో వారు కోరిన రోజున ఆసుపత్రిలోని రోగులకు ఉచితంగా వైద్యసేవలు అందజేస్తారని తెలిపారు. దాతలను ఆసుపత్రికి ఆహ్వానించి సంజీవ హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు చేయించి, రోగులకు ఆ దాతల ద్వారా పండ్లు పంపిణీ చేయిస్తారన్నారు. ఈ పథకంలో ఇప్పటిదాకా 83మంది దాతలు చేరారని, మరికొందరు దాతలు ముందుకు రావాలని ఆయన కోరారు. దాతలు సోహన్‌లాల్ జైన్, జేపీ జైన్, ఆసుపత్రి ఛైర్మెన్ సీతారామిరెడ్డి, మేనేజర్ గురుప్రసాద్, హరికుమార్‌రెడ్డి, సుబ్బారావు, బాలు తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని చైతన్యవంతం చేసేదే.. కవిత్వం

### - సినీకవి వెన్నెలకంటి



'అడిగోపుల అభ్యుదయ కవిత్వం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెన్నెలకంటి

సమాజానికి చైతన్యం కలిగించి సంస్కరించే శక్తి కవిత్వానికే ఉందని, సమాజంలోని రుగ్మతలను ఎత్తిచూపుతూ సమాజాభ్యుదయానికి బాటలు వేసేదే కవిత్వమని ప్రముఖ సినీకవి వెన్నెలకంటి అన్నారు. కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి రచించిన అడిగోపుల అభ్యుదయ కవిత్వం పుస్తకాన్ని ఈనెల 18న ఆయన నెల్లూరు పురమందిరంలోని ఏసి హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడిగోపుల అభ్యుదయ కవిత్వాన్ని కొండ్రెడ్డి మరింతగా వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. విఎస్‌యు తెలుగుశాఖ అధిపతి ఆచార్య శ్రీపాద జయప్రకాష్, ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య, ఆడిగోపుల వెంకటరత్నం, కొమ్మవరపు విల్సన్‌రావు, టి.రమణయ్య, ఈతకోట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత పలు సామాజిక అంశాల ఇతివృత్తంతో నిర్వహించిన కవిసమ్మేళనం అందరినీ ఆకట్టుకుంది.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయండి

ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు సబ్ కలెక్టర్ ఇన్‌ఛార్జి బాపిరెడ్డికి సూచించారు.

ఈనెల 19న గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఎమ్మెల్యే వెళ్ళి గూడూరు నియోజకవర్గంలోని పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్పందన కార్యక్రమానికి వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, నాశిన నాగులు, రాజారెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ బాపిరెడ్డితో చర్చిస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు

## గూడూరు డివిజన్ వార్తలు

## ఉత్తమ సేవలకు గుర్తింపు



హోంమంత్రి సుచరిత నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న హెడ్‌కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వర్లురాజు

గూడూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుళ్ళు ఆర్.వెంకటేశ్వర్లురాజు, ఆదినారాయణలు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినందుకు గాను జిల్లా పోలీసులు ఉత్తమ సేవా అవార్డులకు ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, హోంమంత్రి సుచరిత, ఎస్పీ ఐశ్వర్య రస్తోగి, జిల్లా కలెక్టర్ శేషగిరిబాబు చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. ఉత్తమ సేవా పతకాలను అందుకున్న వారిని గూడూరు పోలీసులు అభినందించారు.

## ఫోటోగ్రాఫర్ల కృషి అభినందనీయం



ర్యాలీ నిర్వహిస్తున్న ఫోటోగ్రాఫర్స్ ప్రతినిధులు

ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఈనెల 19న గూడూరు పట్టణవీధుల్లో ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లు సోమవారం ర్యాలీ నిర్వహించారు. రెండవ పట్టణంలోని మాలవ్యానగర్ నుంచి గడియారపు స్తంభం కూడలి వరకు ఈ ర్యాలీ జరిగింది. వైకాపా యువజన నాయకుడు, చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మండ్ల సురేస్‌బాబు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ సృష్టిలో ఏ వస్తువునైనా అందంగా తీర్చిదిద్దడంలో ఫోటోగ్రాఫర్ల కృషి అభినందనీయమన్నారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం సీనియర్ ఫోటోగ్రాఫర్లను సన్మానించారు. ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నాయకులు చిరంజీవిగౌడ్, సుధాకర్‌నాయుడు, ఎస్‌కె ఖాదర్ హుస్సేన్, కృష్ణ, ఎస్‌కె అల్తాఫ్, గణేష్, ఎల్‌వి ప్రసాద్, రాఘవేంద్రరావు, పెంచలనరసయ్య, చెన్నుపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

### బుస్సారెడ్డి కుంతలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో..

## విద్యార్థులకు యూనిఫాం పంపిణీ




విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ మహేంద్రరెడ్డి

గూడూరు రోటరీక్లబ్–వెస్ట్ ఆధ్వర్యంలో బుస్సారెడ్డి కుంతలమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ట్రస్ట్ ఛైర్మెన్ బుస్సారెడ్డి శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. పోటుపాళెం ప్రాథమిక పాఠశాలలో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని సూచించారు. క్లబ్ ప్రతినిదులు డాక్టర్ మహేంద్రరెడ్డి, బుజగేంద్రరావు, నాగులు, దయాకర్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, గిరిబాబు, ప్రధానోపాధ్యాయుడు సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో..

## సైకిళ్ళు, కుర్చీలు పంపిణీ



విద్యార్థినులకు స్టడీకుర్చీలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వరప్రసాదరావు, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి తదితరులు

గూడూరు రోటరీ భవన్‌లో డ్రీమ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రస్ట్ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి పుట్టినరోజు సందర్భంగా విద్యార్థినులకు సైకిళ్లు, స్టడీ కుర్చీలు పంపిణీ చేశారు. గూడూరు ఎమ్మెల్యే వి.వరప్రసాదరావు చేతులమీదుగా ఈ పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, కె.మునిగిరీష్, బి. దశరథరామిరెడ్డి, డాక్టర్ సి.జనార్దన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, డాక్టర్ మహేంద్రరెడ్డి, కె.మునిరాజా, నాగులు, దయాకర్‌రెడ్డి, జానకిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

గూడూరు పట్టణంలో గంజాయిని విక్రయిస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణలోని ఖమ్మం జిల్లా ఇల్లెందు మండలం కొమరం గ్రామానికి చెందిన ఎం.ధర్మ గంజాయిని విక్రయిస్తుండగా అరెస్ట్ చేశామని పట్టణ సిఐ దశరథరామారవు, ఎస్‌ఐలు సైదులు, బ్రహ్మానాయుడు తెలిపారు.

# గౌడ విద్యార్థులకు పురస్కారాలు

నెల్లూరు జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవాసమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 18న ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలను అందజేశారు.




గౌడ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్న గౌడ సేవాసమితి ట్రస్టు సభ్యులు

ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షుడు కోసూరు గోవిందయ్య గౌడ్ మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు బాగుండాలంటే జీవన సరళిలో మార్పు రావాలని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను బాగా చదివించాలని సూచించారు. ప్రభుత్వ హైస్కూళ్ళలో చదువుతూ పదవ తరగతిలో 8.5జీపీఏకు పైగా సాధించిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రతి ఏటా ప్రతిభా పురస్కారాలను అందజేస్తున్నామన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.5వేలు నగదు, ప్రశంసాపత్రం, మెమెంటోతో పాటు విద్యాసామగ్రిని అందజేస్తున్నామన్నారు. గీత కార్మికులు ప్రమాదవశాత్తు చెట్టువీద నుంచి పడి గాయపడితే రూ.10వేలు, మరణిస్తే రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని తమ సంఘం ద్వారా అందజేస్తున్నామన్నారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కడప జిల్లా అటవీ శాఖాధికారి శివప్రసాద్, టిటిడీ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ తోట ప్రభాకర్, కడప ప్రొహిబిషన్ అసిస్టెంట్ కమీషనర్ టి. శ్రీనివాసరావు, వెల్‌టెక్ లా యూనివర్శిటీ ప్రొఫెసర్ అన్నం సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎన్. వెంకటాచలపతి గౌడ్, డాక్టర్ బదుగు కృష్ణమూర్తి, పారిశ్రామికవేత్త రావుల శివాజి, ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొఫెసర్ రావుల లావణ్య, గౌడ నాయకులు ఆలపాక శ్రీనివాసులు, నడవడి ముత్యం గౌడ్, బట్టికాల తంబయ్య గౌడ్, తాతా రమణయ్య గౌడ్, ఆరేటి మాల కొండయ్య గౌడ్, జడపల్లి దయాకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ బాటలో జగన్

## - డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ బాటలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తున్నారని డిప్యూటి స్పీకర్ కోన రఘుపతి పేర్కొన్నారు. ఈనెల 19న కావలిలోని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వై.యస్.జగన్ సీఎం అయిన తర్వాత 50 రోజుల్లోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అర్థిక జవసత్వాలతో పాటు రాజకీయంగా గౌరవ స్థానం దక్కేలా చర్యలు తీసుకున్నారని, నామినేటెడ్ పదవుల్లో 50శాతం, నామినేటెడ్ కాంట్రాక్ట్ పనుల్లో 50 శాతం రిజర్వేషన్లు, తదితరాలపై అసెంబ్లీలో బిల్లులు పెట్టి చట్టాలు చేశారని పేర్కొన్నారు. ఎస్సీలకు ప్రత్యేకంగా సబ్‌ప్లాన్ కింద మొదటి ఏడాదిలోనే రూ.15,000.86 కోట్లను కేటాయించారని, ఎస్టీలకు రూ.4,988.53 కోట్ల సబ్‌ప్లాన్ నిధులను మంజూరు చేశారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు రూ.430.35 కోట్లను కేటాయించారని, బీసీలకు రూ.15,061 కోట్లు, కాపులకు రూ.2 వేల కోట్లును కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైకాపా నాయకులు మన్నెమాల సుకుమార్‌రెడ్డి, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, సన్నిబోయిన ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచలకోనలో కన్నులపండువగా నృసింహస్వామి కల్యాణం

రాపూరు మండలంలోని పెంచలకోనలో ప్రసిద్ధమైన శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఈనెల 17న స్వామి వారి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్లకు శోభాయమానంగా అలంకారాలు నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం స్వామివార్లను తిరుచ్చిపై ఊరేగింపుగా సహస్ర దీపాలంకరణ మండపానికి తీసుకువచ్చి ఊంజల్‌సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివార్ల తీర్థప్రసాదాలతో పాటు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ అధికారుల పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, దూరప్రాంతాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు.

# చంద్రబాబుపై కక్ష సాధించిన వరుణ దేవుడు

శ్రీను గల్పిక

సూర్యోదయాన సమయం 6గంటలు. హైటెక్‌రత్న చంద్రబాబునాయుడు గాఢ నిద్రలో వున్నాడు. డాడీ... డాడీ... అన్న పిలుపుతో ఆయన ఉలిక్కిపడి లేచాడు. కళ్ల తెరిస్తే ఎదురుగా లోకేష్ వున్నాడు. ఏమైందిరా అంత గట్టిగా అరిచి లేపావ్ అని అడిగాడు. లోకేష్ అందుకు... మన ఇల్లు కృష్ణానదిలోకి కొట్టుకుని వచ్చింది అని చెప్పాడు. ఆ మాటకు చంద్రబాబు గుండెల్లో రాయి పడ్డట్లయ్యింది. ఇల్లు నదిలోకి కొట్టుకురావడమేంట్రా... ఏం చూసి ఏమనుకుంటున్నావ్ అని బెడ్ రూంలో నుండి బయటకొచ్చాడు. అక్కడ చూస్తే చుట్టూ నీళ్ళు... కృష్ణానది వరద ప్రవాహం కరకట్ట మీదున్న చంద్రబాబు నివాసాన్ని ముంచెత్తి వుంది. చంద్రబాబు లోకేష్‌తో... సుపుత్రా... కృష్ణా నదిలోకి మన ఇల్లు రాలేదు, కృష్ణా నది మన ఇంటిని చుట్టుముట్టింది. ఇట్లాంటి విషయాలు ఇంకెప్పటికి తెలుసుకుంటావురా...? ఇప్పుడు ఇక్కడనుండి బయటపడే మార్గం చూడు అని అంటుండగా... అప్పుడే ఒక బోటు అక్కడకు వచ్చింది. అందులో దేవినేని ఉమా మహేశ్వరరావు, బోండా ఉమ, బుద్దా వెంకన్నలు వున్నారు. చంద్రబాబు కుటుంబసభ్యులను ఆ బోటులో ఎక్కించుకుని వాళ్ళు విజయవాడ దుర్గా ఘాట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ పెద్దఎత్తున మీడియా వాళ్ళు వచ్చివున్నారు. చంద్రబాబు ప్రెస్‌మీట్ పెట్టాడు. ఇది అత్యంత దుర్మార్గం... జగన్మోహన్‌రెడ్డి నాపై పన్నిన కుట్ర. నోటీసులిస్తే ఇల్లు ఖాళీ చేయడం లేదని చెప్పి ఇలా వరదనీళ్ళు మా ఇంటి దాకా వచ్చేలా చేశాడు. కృష్ణానదిలో వచ్చిన వరదను వచ్చినట్లే సముద్రానికి వదిలేసి వుంటే ఈరోజు నా ఇంటిదాకా నీళ్లొచ్చి వుండేవి కావు కదా. కరకట్ట మీద అక్రమ నిర్మాణాలు తొలగించాల్సిన పనివుండేది కాదు కదా! నా హయాంలో వరదలు వచ్చుంటే నేను ఆ పనే చేసుండేవాడిని, కరకట్ట మీద అక్రమ కొంపలను జాగ్రత్తగా కాపాడి వుండేవాడిని. కేవలం నా చేత ఇల్లు ఖాళీ చేయించడానికే ప్రకాశం బ్యారేజీలో నీళ్ళు నిల్వ పెట్టారు. దీనిని నేను కేంద్రం దృష్టికి తీసుకెళ్లి న్యాయం కోరతాను అని ముగించాడు. తర్వాత చంద్రబాబు, ఆయన కుటుంబసభ్యులు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుని అక్కడనుండి హైదరాబాద్‌కు విమానమెక్కారు.

★★★★★

రాత్రి 11గంటలైంది. హైదరాబాద్‌లోని చంద్రబాబు ఇల్లు. తన బెడ్‌రూమ్‌లో చంద్రబాబు నిద్ర పట్టక అటు ఇటు తిరుగుతున్నాడు. చాలా సేపు చూశాక, భువనేశ్వరీదేవి వుండి... ఎందుకండి అంత టెన్షన్‌గా వున్నారు. ఇప్పుడేమైందని, కరకట్ట మీద ఇల్లు పోతే పోయింది. ఇంకో ఇల్లు కట్టుకుంటాములే అని ధైర్యం చెప్పింది. చంద్రబాబు అందుకు... ఇల్లు పోయిందని కాదే నా బాధ... ఆ వరుణదేవుడికి ఇంకేం పనీ పాట లేదా... నన్ను శత్రువుగా చూస్తున్నాడు. అంతకుముందు చూస్తే నేను 9ఏళ్లు సీఎంగా వున్నప్పుడు కరువు, వై.యస్.రాజశేఖరరెడ్డి సీఎం కాగానే ఐదేళ్లు వర్షాలు... మళ్ళీ నేను సీఎంగా వున్న గత ఐదేళ్లు కరువు, వై.యస్. కొడుకు జగన్ సీఎం అయ్యి అవ్వగానే మళ్ళీ వర్షాలు, వరదలు... నేను ఏం పాపం చేశాను, నాకేంటి ఈ శాపం అని బాధగా అడిగాడు. అక్కడే వున్న లోకేష్ వెంటనే... డాడీ వరుణయాగం మాదిరిగా మనం సూర్యయాగం చేయిద్దాం. ఎండలు ముదిరి ఈ జగన్ ప్రభుత్వంలో కరువుకాటకాలు ప్రబలుతాయని సలహా ఇచ్చాడు. లోకేష్ వైపు చంద్రబాబు వికారపు చూపు చూశాడు. భువనేశ్వరీ దేవి అందుకుని... హిమాలయాలలో నాకు తెలిసిన ఢంఢం డంబోలా స్వామి వున్నారు. ఉదయాన్నే అక్కడకు వెళ్లి ఆయనను కలుద్దాం.. అసలు ఇదంతా ఎందుకు జరుగుతుందో ఆయన తన దివ్యదృష్టితో చెబుతాడు అని చెప్పి చంద్రబాబును పడుకోమంది.

★★★★★

హిమాలయాలలోని ఓ గుహలో ఢంఢం డంబోలా స్వామి తపోదీక్షలో వున్నాడు. ఆ పక్కనే వున్న సిడి ప్లేయర్‌లో శివుని భక్తిపాటలు వస్తున్నాయి. చంద్రబాబు, భువనేశ్వరి, లోకేష్, బ్రాహ్మణిలు స్వామి వద్ద క్రింద కూర్చుని వున్నారు. పదినిముషాల తర్వాత స్వామి కళ్ళు తెరిచాడు. ఎదురుగా కనిపించిన భువనేశ్వరీదేవితో... ఏం తల్లీ బాగున్నావా, ఎంతసేపయ్యింది వచ్చి అని కుశల ప్రశ్నలు వేశాడు. ఆమె స్వామికి పాదాభివందనం చేసి, పుష్పాలు, పండ్లు సమర్పించింది. ఏం సమస్య మీదవచ్చారని డంబోలా స్వామి అడిగాడు. చెప్పండి అన్నట్లు చంద్రబాబు వైపు చూసి భువనేశ్వరిదేవి సైగ చేసింది. చంద్రబాబు ఆయనతో... స్వామి ఈ దేశంలో నాపై నరేంద్ర మోడీ ఒక్కడే కక్ష కట్టాడనుకున్నాను, వరుణదేవుడు అంతకన్నా ఎక్కువ కక్ష కట్టాడు. నా పాలనలో వర్షాలు పడవు... నా ప్రత్యర్థులు అధికారంలోకి రాగానే అక్కడే మాటేసి వున్నట్లు వరదలొస్తాయి. జనాల్లో ఇది పాపులర్ అవుతుంది. కరువుకు బ్రాండ్ అంబాసిడర్‌గా నా పేరు మార్మోగిపోతోంది. అసలు వరుణ దేవుడు నాపై ఇంతగా కక్ష కట్టడానికి కారణమేమై వుంటుంది అని అడిగాడు. అప్పుడు డంబోలా స్వామి రెండు కళ్ళు మూసుకుని మెడపైకెత్తాడు. తన మనోనేత్రాన్ని విప్పాడు. నిముషంలో స్వామికి సీన్ అర్థమైంది. వెంటనే మనోనేత్రాన్ని క్లోజ్ చేసి అసలు నేత్రాలను తెరిచాడు. చంద్రబాబును నోరు తెరవమన్నాడు. ఆయన నోరు తెరవగానే ఆయన నోట్లో కొంచెం విభూది చల్లాడు. తర్వాత గాల్లోనే వేలితో ఎయిర్ స్క్రీన్ గీశాడు. నీ పూర్వజన్మలో ఏం జరిగిందో చూడు... హాంఫట్ భటాభట్ ఆలియా భట్ అని అరిచాడు. అంతే ఎయిర్ స్క్రీన్‌పై సీన్‌లు మొదలయ్యాయి.

★★★★★

అది చంద్రగిరి రాజ్యం. రాజు తారకరత్న సేనుడు జనరంజకంగా పరిపాలన చేస్తున్నాడు. ఆ రాజుకు నలుగురు కొడుకులు. వారు ఒట్టి అమాయకులు. తారకరత్న సేనుడి అల్లుడు చంద్రసేనుడు సైన్యాధ్యక్షుడుగా వున్నాడు. ఎప్పటి నుండో చంద్రగిరి రాజ్యంపై చంద్రసేనుని కన్నుంది. ఎలాగైనా రాజ్యాధికారాన్ని కబళించాలనేది ఆయన పన్నాగం. ఓరోజు రాజు తారకరత్న సేనుడు వేటకు బయలు దేరాడు. ఆయనకు రక్షణగా చంద్ర సేనుడు, నలుగురు భటులు కూడా వున్నారు. వీళ్ళు అడవిలో వేట ముగించుకుని తిరిగి వస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. అప్పుడే తారకరత్నసేనుడు సమీపంలో ఒక పిడుగుపడడంతో ఆయనకు కళ్ళు మస కలు కమ్మాయి. వెంటనే కుండపోత వర్షం మొదలైంది. తనకు కళ్ళు బైర్లు కమ్మిన విషయాన్ని చంద్రసేనుడికి చెప్పాడు తారకరత్నసేనుడు. అప్పుడే చంద్రసేనుడి మెదడులో విషపు ఆలోచనలు మొలకెత్తాయి. తారకరత్నసేనుడును అంత మొందించి అమాయకులైన బావమరదులను బురిడీ కొట్టించి రాజ్యాన్ని కబళించడానికి ఇదే అనువైన సమయమనుకున్నాడు. వెంటనే రాజు తారకరత్నసేనుడును ఒక వాగులోకి తీసుకొచ్చి నిలబెట్టి... మహారాజా... మీరిక్కడే నిలబడి వుండండి... దగ్గర్లో పుత్తడిరెమ్మ ఆకులు దొరుకుతాయి, వాటిని తెచ్చి కళ్ళ మీద పెడితే చూపు యధాతదంగా వుంటుందని చెప్పాడు. రాజు అలాగేనన్నాడు. కొద్దిసేపటికి వర్షం పెద్దదైంది. దాంతో వాగులో వరదొచ్చి రాజు తారకరత్నసేనుడు కొట్టుకుపోయాడు. చంద్రసేనుడు అంత:పురానికి చేరుకుని... బావమరుదులతో.. ఘోరవిషాదం జరిగిపోయింది, మన మహారాజును ఆ వాన దేవుడు పొట్టనపెట్టుకున్నాడు. ఈరోజు కురిసిన భారీ వర్షాలకు వరద ఉధృతిలో ఆయన కొట్టుకుపోయాడు. ఈ రాజ్యాన్ని ఇక మీరే కాపాడుకోవాలి... నేను అలా పుణ్య క్షేత్రాలకు వెళ్లి మహారాజు గారి ఆత్మ శాంతి కోసం పూజలు చేస్తాను అని అన్నాడు. అప్పుడు బావమరుదులు నలుగురూ... బావగారూ... మాకు మద్యం తాగడం, మాంసం తినడం తప్ప ఇంకోటి తెలియదు. మా తండ్రిగారిని పొట్టనపెట్టుకున్న ఆ వానదేవుడు మాకు ఇక ఎప్పటికీ శత్రువే. ఆయన కోసం ఇక ఈ రాజ్యంలో యాగాలు, హోమాలు చేయకుండా నిషేధం విధించండి. ఈ రాజ్యపాలన భారం మాపై దయతో మీరే చూడండి అని కోరారు. చంద్రసేనుడు తన పాచిక పారిందనే ఆనందంతో సింహాసనం అధిరోహించాడు.

ఇక్కడితో సీన్‌లు అయిపోయాయి. చంద్రబాబు వుండి... ఈ సినిమా నాకెందుకు చూపించారు స్వామి అని అడిగాడు. దానికి డంబోలా స్వామి... పిచ్చివాడా... ఇంకా నీకు సీన్ అర్థం కాలేదా... పూర్వజన్మలో ఆ చంద్రసేనుడి క్యారెక్టర్ నీదే. తప్పు నువ్వు చేసి నెపం వానదేవుడి మీదకు నెట్టి, రాజపుత్రుల చేత ఆయనను తిట్టించావు, అది మనసులో పెట్టుకునే వరుణదేవుడు ఈ జన్మలో నీపై కక్ష సాధిస్తున్నాడని చెప్పాడు. ఆ మాటతో చంద్రబాబుకు నోట మాట రాలేదు.

# మాంసంతో... మోసం!

- కోటలో 285 కిలోల కుళ్ళిన మాంసం!
- చికెన్‌స్టాల్స్‌పై అధికారుల దాడులు



కుళ్ళిన మాంసాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సింహపురి సమాచారం

కుళ్ళి.. గబ్బుకొడుతున్న మాంసాన్ని విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో చెలగాట మాడుతున్న మాంసం వ్యాపారుల బండారం మళ్ళీ బయటపడింది. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో అధికారులు దాడులు చేస్తుండడంతో ఒక్కోచోట ఒక్కోవిధంగా ఈ ఘోరాలు బయటపడుతున్నాయి. కుళ్ళిపోయి పురుగులు పట్టివున్న మాంసాన్ని ఇటీవలే నెల్లూరులో భారీస్థాయిలో అధికారులు పట్టుకున్న విషయం అందరికీ తెలిసిందే. తినే ఆహారాన్ని కూడా కలుషితం చేసి.. డబ్బు చేసుకునే ఈ పాపపు వ్యాపారం ఒక్క నెల్లూరు నగరంలోనే కాదు, జిల్లాలో అనేకచోట్ల భారీగానే జరుగుతున్నట్లు తెలుస్తోంది. అధికారులు కొరడా ఝుళిపిస్తుండడంతో ఈ దారుణాలు సర్వత్రా వెలుగులోకి వస్తున్నాయి.

తాజాగా ఈనెల 18న మండల కేంద్రమైన కోటలోని రవినగర్‌లో ఉన్న ఎస్‌కెబి చికెన్‌స్టాల్‌పై ఫుడ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది ఆకస్మికంగా దాడులు చేయడంతో ఈ కుళ్ళిన మాంసం వ్యవహారం బయటపడింది. అక్కడ సుమారు 285 కిలోల కుళ్ళిన మాంసం ఉండడంతో అధికారులకే నోటమాట రాలేదు. ఇక జనం సంగతి చెప్పాలా?.. అది చూసి గుండెలు బాదుకున్నారు. ఈ మాంసాన్నేనా మనం తింటుండేది అని కొనుగోలుదారులంతా ఒక్కసారిగా బెంబేలెత్తిపోయారు. కూలర్‌లో ఐసుగడ్డల మధ్య ఇంత భారీ స్థాయిలో ఉన్న కుళ్ళిన మాంసాన్ని చూసి తనిఖీకి వెళ్ళిన అధికారులు సిబ్బంది అవాక్కయిపోయారు. ఈ మాంసం ఎక్కడిదని వారు ఆరాతీయగా, చిత్తూరు జిల్లా నుంచి చికెన్ లివర్‌ను తెచ్చి రోజుల తరబడి కూలర్‌బాక్స్‌ల్లో నిల్వ ఉంచి అమ్ముతున్నట్లుగా తెలుసుకుని నివ్వెరపోయారు. ఒక వాహనంలో ఉన్న బాక్సుల్లో ఈ కుళ్ళిన మాంసం ప్యాకెట్లు కట్టిపెట్టి ఉన్నారు. ఒక్కో ప్యాకెట్‌లో అయిదు కిలోల దాకా చికెన్ ఉంది. అది అప్పటికే బ్యాక్టీరియల్ ఫంగస్‌తో గబ్బు కొడుతోంది. 57 ప్యాకెట్లలో ఉన్న 285 కిలోల కుళ్ళిన మాంసాన్నంతా అధికారులు బయటకు తీయించి ఫినాయిల్ పోసి పూడ్చిపెట్టారు. చికెన్‌స్టాల్ యజమానికి 5వేల రూపాయల జరిమానా విధించారు. అదేవిధంగా కోట బజార్‌లో ఉన్న నౌషాద్ చికెన్‌స్టాల్‌పై కూడా అధికారులు దాడులు చేసి అక్కడ ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన మాంసాన్ని గుర్తించి జరిమానా విధించారు.

ఈ దాడుల్లో ఫుడ్ సేఫ్టీ అధికారి రామచందర్‌తో పాటు ఆర్‌ఐ రమ్యస్వాతి తదితరులు పాల్గొన్నారు. ఇలా కుళ్ళిన మాంసాన్ని అమ్ముతూ ఎంతమంది ప్రజల ఆరోగ్యాన్ని నాశనం చేస్తున్నారో...ఎన్నాళ్ళ నుంచి..ఎన్నేళ్ల నుంచి ఇలా జనాన్ని మాంసం పేరుతో మోసం చేస్తున్నారో ఆ దేవుడికే తెలియాలి!...

# జగన్ పాలనవైపు ఇతర రాష్ట్రాల చూపు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి తీసుకుంటున్న సాహసోపేత నిర్ణయాలపై ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని, తమ రాష్ట్రాలలో కూడా అమలు చేస్తే ఎలా వుంటుందని ఆలోచిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి అన్నారు. ఈనెల 19న కోవూరు మండలం పడుగుపాడులోని రుక్మిణీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు నీతివంతమైనపాలన అందజేస్తున్నారన్నారు. త్వరలో రాష్ట్రంలో ఎక్కువ పరిశ్రమలు, పెట్టుబడులు వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా చూస్తున్నామన్నారు. త్వరలో ఆంధ్రప్రదేశ్ రూపురేఖలు పూర్తిగా మారే అవకాశాలు ఉన్నాయని, అభివృద్ధి అంటేనే జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుకు వచ్చేలా పరిపాలన ఉంటుందన్నారు. ప్రక్క రాష్ట్రాల ప్రభుత్వాలు అభివృద్ధి అంటే ఏ విధంగా ఉండాలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని చూసి నేర్చుకునే విధంగా ఉండబోతుందన్నారు. గత ఐదు సంవత్సరాల చంద్రబాబు పాలనలో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారన్నారు. వైయస్సార్ సీపీ నాయకులు డి.నిరంజన్‌బాబు రెడ్డి, పి.రాధాకృష్ణారెడ్డి, ఎన్.సుబ్బారెడ్డి, ఆర్.మల్లిఖార్జునరెడ్డి, కె.చంద్రారెడ్డి, కె.దినేష్‌రెడ్డి, ఎస్‌కె అహమ్మద్, నరశింహులు రెడ్డి, మధురెడ్డి, సూరి, వేణుగోపాల్‌రెడ్డి, అట్లూరి సుబ్రహ్మణ్యం, చిరంజీవి, నావూరు శ్రీను పాల్గొన్నారు.

# విద్యార్థులు దేశభక్తితో మెలగాలి



ఇన్‌వెస్టిట్యూర్ సెరిమనీ వేడుకలో విద్యార్థులతో రెయిన్‌బో సిబిఎస్‌ఇ స్కూల్ యాజమాన్యం

నెల్లూరు రూరల్ మండలంలోని కలివెలపాళెం గ్రామంలో ఉన్న రెయిన్‌బో సిబిఎస్‌ఇ స్కూల్‌లో ఇన్‌వెస్టిట్యూర్ సెరిమనీ–2019 వేడుక ఇటీవల అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి రిటైర్ట్ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ వింగ్ కమాండర్ శ్యామ్‌ప్రసాద్ విచ్చేసి జ్యోతిప్రజ్వలనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి భావిభారతపౌరులుగా రాణించాలన్నారు. ప్రతి ఒక్కరు దేశభక్తితో ఉండాలన్నారు. విద్యార్థులందరిచేత దేశభక్తిని చాటేలా ప్రమాణం చేయించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన దేశభక్తి గేయాలు, నృత్యప్రదర్శనల కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రతాప్‌రాజ్, వైస్ ప్రిన్సిపాల్స్ బద్దెపూడి హరిత, సురేఖారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గోశాలకు ఆవుల తరలింపు

గత పదిరోజులుగా రోడ్లపై తిరుగుతూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఆవులను నగరపాలక సంస్థ మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఆధ్వర్యంలో నెల్లూరు ఫతేఖాన్‌పేటలోని పశువులదొడ్డికి తరలించారు. ఆ ఆవుల సొంతదారులు ఎవరైనా ఉంటే జరిమానా కట్టి ఆవులను తీసుకువెళ్ళాలని చెప్పినా ఎవరూ ముందుకు రాకపోవడంతో కార్పొరేషన్ అధికారులు 30 ఆవులను ఈనెల 20న గోశాలకు తరలించారు. లారీ ద్వారా వాటిని గోశాలకు తరలించేందుకు అధికారులు ప్రయత్నిస్తుండగా, కొందరు అడ్డుకోవడంతో పోలీసు బందోబస్తు మధ్య వాటిని తరలించారు. వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, శానిటరీ సూపర్‌వైజర్ ప్రతాప్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శేషయ్య తదితరుల ఆధ్వర్యంలో ఆవులను గోశాలకు తరలించారు.

# కాపు భవనాన్ని సందర్శించిన అనిల్



రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి పి.అనిల్‌కుమార్‌యాదవ్ ఈ నెల 21న నెల్లూరు, ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం ప్రాంతంలో నిర్మాణంలో వున్న కాపు భవన్‌ను పరిశీలించారు. కాపు భవనం గ్రౌండ్ ఫ్లోర్‌కు 3.45కోట్లు మంజూరైనట్లు ఆయన తెలిపారు. జిల్లా నలుమూలల నుండి వచ్చే బాలబాలికల హాస్టల్‌కు అనువుగా కాపు భవన్‌ను డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ఏడాదిలోపే కాపు భవన్‌ను వినియోగంలోకి తెస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ఆయన వెంట నెల్లూరు రూరల్ వైసిపి కార్యాలయం ఇన్‌ఛార్జ్ కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వైసిపి నాయకులు తాటి వెంకటేశ్వర్లు, నూనె మల్లిఖార్జునయాదవ్, కొణిదల సుధీర్, వందవాసి రంగ, పి.నారాయణ, సూరిశెట్టి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మోకాలి శస్త్ర చికిత్సల్లో...

# ఐదు సెంచరీలు పూర్తి చేసిన అపోలో!



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, వివేకానందరెడ్డి

నెల్లూరులోని అపోలో స్పెషాలిటీ హాస్పిటల్ మరో మైలురాయిని దాటింది. 500 మోకీళ్ల మార్పిడి ఆపరేషన్‌లను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఆసుపత్రిని ప్రారంభించిన 2015 సంవత్సరం నుండి ఇప్పటివరకు ఇన్ని ఆపరేషన్లను పూర్తి చేయగలిగారు. ఇటీవల ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెన్నై అపోలో హాస్పిటల్ ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి దీనికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. సాధారణంగా మోకీలు శస్త్ర చికిత్స జరిగితే వారంరోజుల పాటు ఆసుపత్రిలో వుండేవారని, డిశ్చార్జ్ తర్వాత కూడా కొన్ని నెలల పాటు ఇంట్లో విశ్రాంతి తీసుకోవాల్సి వచ్చేదన్నారు. అయితే అపోలో ఆసుపత్రిలో 2015 నుండి ఫాస్ట్‌ట్రాక్ నీల్‌ప్లేస్‌మెంట్ విధానాన్ని పరిచయం చేశామని, దీనిద్వారా నొప్పి లేకుండా మోకీలు మార్పిడి చేయొచ్చని, చికిత్స అనంతరం 3రోజుల్లోనే రోగి డిశ్చార్జ్ కావొచ్చని, ఇంటి దగ్గర కూడా పెద్దగా విశ్రాంతి అవసరముండదన్నారు. మోకీలు ఆపరేషన్‌లలో త్వరలో మరో అధునాతన విధానాన్ని ప్రవేశపెట్టబోతున్నామని, ఈ విధానంలో ప్రవేశపెట్టబోయే గోల్డ్‌నీ, విటమిన్–ఇ, ఎన్‌రిచ్‌డ్‌పాలి వంటి అధునాతన పరికరాలు అత్యంత కాలం మన్నికగా వుంటాయని చెప్పారు. పెద్ద ఖరీదు లేకుండానే ఈ పరికరాలతో మోకీలు శస్త్ర చికిత్స చేయొచ్చని తెలిపారు. ఆర్థోపెడిక్ విభాగం వైద్యనిపుణులు డాక్టర్ సి.వివేకానందరెడ్డి, డాక్టర్ శశిధర్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాసన్, డాక్టర్ షాహుల్, డాక్టర్ చరణ్, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ శ్రీరాం సతీష్, యూనిట్‌హెడ్ నవీన్ పాల్గొన్నారు.

# పోస్టల్ పోటీలకు దరఖాస్తులు పంపండి

తపాలాశాఖలో దీనదయాళ్ స్పర్శ్ యోజన కింద అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని తపాలాశాఖ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. గుర్తింపు పొందిన పాఠశాలల్లో 6నుంచి 9వ తరగతి వరకు చదువుకునేవారు, తపాలా శాఖలో ఒక ఫిలాటలీ (స్టాంపుల సేకరణ) డిపాజిట్ అకౌంట్ కలిగి ఉండాలని, ఇటీవల రాసిన ఫైనల్ పరీక్షలో 60 శాతం మార్కులు లేదా దానికి సమానమైన గ్రేడ్ ఉండాలని సూచించారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు మార్కుల్లో 5శాతం మినహాయింపు ఉంటుందని, మొదటి దశలో రీజనల్ స్థాయిలో రాతపరీక్షలో అర్హత పొందినవారు రెండోదశకు వెళ్తారని, అక్కడ ఫిలాటలీ ప్రాజెక్ట్‌ను సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు ఈనెల 31వ తేది తుదిగడువని, ఉత్తీర్ణులైనవారికి నెలకు 500 రూపాయల వంతున ఏడాదిపాటు ఉపకార వేతనం ఉంటుందని పేర్కొన్నారు.

### లేఖా రచన పోటీలకు ఆహ్వానం...

'ప్రియమైన బాపూ..మీరు అమరులు' అనే అంశపై లేఖా రచన పోటీలు (ఉత్తరాల ద్వారా) నిర్వహించనున్నామని పోస్టల్ సూపరింటెండెంట్ ఈ సందర్భంగా తెలియజేశారు. తెలుగు లేదా ఆంగ్ల భాషల్లో లేఖా రచన చేయవచ్చని, రచనలను సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, నెల్లూరు డివిజన్, నెల్లూరు–1 అనే చిరునామాకు పంపాలని సూచించారు.

## నేత్రపర్వంగా..

# భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

• భక్తజన సంద్రంగా మారిన గొలగమూడి



ఆకలై కొంగుపట్టేవారికి అన్నం పెట్టాలయ్యా!.. ఆపదల్లో ఉన్నవారిని ఆదుకోవాలయ్యా!..అంటూ మానవాళికి మానవీయమైన బోధనలు చేసిన అవధూత.. భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారి 37వ ఆరాధనా మహోత్సవాలు వెంకటాచలం మండలంలోని గొలగమూడిలో ఈనెల 18 నుంచి వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని, ఆలయ ప్రాంగణాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. గొలగమూడి గ్రామంలోనూ విద్యుద్దీపాలంకరణలతో ఆకర్షణీయంగా రూపుదిద్దారు. ఆరాధనోత్సవాల్లో భాగంగా ప్రతినిత్యం స్వామివారి మందిరంలో ప్రత్యేక పూజలు, వాహనోత్సవాలు వేడుకగా నిర్వహిస్తున్నారు. స్వామివారికి ప్రతిరోజు ఉదయం, రాత్రి జరిగే గ్రామోత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొంటున్నారు. భక్తులకు కొంగుబంగారంగా..దక్షిణభారత దేశంలో ప్రసిద్ధిచెందిన పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధికెక్కిన గొలగమూడి ఆలయం ఈ ఉత్సవాలతో కళకళలాడుతోంది. ప్రతి రోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి సంగీత కార్యక్రమాలు, భక్తబృందాల భజనలు, కోలాటాలు, నాటకాల ప్రదర్శనలతో గొలగమూడి హోరెత్తిపోతోంది. ఈనెల 24వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలకు జిల్లా నలుమూలలనుంచే కాక, తమిళనాడు తదితర దూరప్రాంతాల నుంచి కూడా భక్తజనం ఒక ప్రవాహంలా కదలివస్తున్నారు. పెద్ద సంఖ్యలో తరలివస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆశ్రమ ఇ.ఓ పి.బాలసుబ్రహ్మణ్యం అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలకు సుమారు నాలుగు లక్షల మందిదాకా భక్తులు వస్తారని అంచనా వేసి అందుకు తగ్గట్టుగా తాగునీటి వసతి, వైద్యసేవలు, వసతి సౌకర్యాలు తదితరాలన్నీ ఏర్పాటు చేశారు. 'ఆకలైనవారికి అన్నం పెట్టాలయ్యా'.. అంటూ స్వామివారు ప్రధానంగా బోధించిన సూక్తిని పాటిస్తూ ఆలయానికి విచ్చేసే వేలాదిమంది భక్తులకు గొలగమూడి ఆశ్రమకమిటీ వారి ఆధ్వర్యంలో నిరంతరం పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ జరుగుతూనే ఉంది.

### కనువిందుగా వాహనసేవలు..

ఆరాధనోత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రతి ఉదయం, రాత్రి వేళల్లో నేత్రపర్వంగా వాహనసేవలు జరుగుతున్నాయి. 18వ తేదీ ఉదయం సర్వభూపాల వాహనం, రాత్రికి కల్పవృక్ష వాహనసేవలు కన్నులపండువగా జరిగాయి. అదేవిధంగా 19న సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు, 20న హనుమంతవాహనం, రాత్రికి హంసవాహనం, 21న చిన్నశేష వాహనం, గజవాహనసేవ, 22న అశ్వ వాహనం, పెదశేష వాహనసేవ, 23న ఉదయం సింహవాహనం, రాత్రి గరుడ సేవ అంగరంగ వైభవంగా జరిగాయి.



### 24న స్వామివారి ఆరాధనోత్సవం

ఈ ఉత్సవాల్లో ప్రధానమైన ఆరాధనోత్సవం ఈనెల 24న మరింత వైభవంగా జరుగుతుంది. ఉదయం నుంచి రాత్రి లోగా లక్షలాది మంది భక్తులు దూర ప్రాంతాల నుంచి కూడా గొలగమూడికి తండోపతండాలుగా తరలివస్తారు. ఎక్కడ చూసినా భక్తజనంతో గొలగమూడి క్రిక్కిరిసిపోతుంది. ఇదే రోజున స్వామివారికి ఉదయం 9గంటలకు సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి దంపతులు భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. రథోత్సవం అనంతరం రాత్రికి తెప్పోత్సవం అంగ రంగవైభవంగా జరుగుతాయి.

# నెల్లూరులో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామి

మైసూరు దత్త పీఠాధిపతి శ్రీ గణపతి సచ్చిదానందస్వామి ఈనెల 21 న నెల్లూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్వామీజీకి ట్రస్ట్ సభ్యులు పచ్చిపాల ప్రమీలమ్మ, రేబాల పట్టాభిరామిరెడ్డి, అనపల్లి అశోక్‌రెడ్డి, కొండా బలరామిరెడ్డి, డాక్టర్ సర్వేపల్లి అజయ్ కుమార్, మస్తాన్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, జక్కా పట్టాభిరామిరెడ్డి, గోపాలరెడ్డి, భక్తులు స్వాగతం పలికారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు సుజాతమ్మ కాలనీలోని కృష్ణయోగ మందిరంలో ఈనెల 25వతేదీ వరకు జరిగే విశేషపూజల్లో స్వామీజీ పాల్గొంటున్నారు.

# అమరావతి అనుమానమే..?

(మొదటి పేజీ తరువాయి)

9వేల ఖరీదుతో రాజధాని భవనాల కాంట్రాక్ట్‌లను ఎల్ అండ్ టి వంటి కంపెనీలకు అప్పగించాడు. చివరకు వాళ్లు చిన్న వర్షానికే నీళ్లు కారే అసెంబ్లీ, సచివాలయం వంటి భవనాలను కట్టి అప్పగించారు. రాజధాని పేరుతో చంద్రబాబు, ఆయన బృందం ఎన్ని విదేశాలు తిరిగారో, ఎన్ని కోట్లు ఖర్చు పెట్టారో లెక్కేలేదు. వందల కోట్లు దుర్వినియోగం చేశారు. ఆ డిజైన్, ఈ డిజైన్ అంటూ ఎన్నో డిజైన్‌లు మార్చారు. తాత్కాలిక భవనాలు అంటూ వందలకోట్లు తగలేశారు. 2019 ఎన్నికల నాటికి అమరా వతిని ఎటూ కాకుండా చేసిపెట్టారు. చంద్రబాబు తన ఐదేళ్ల కాలంలో ఒక స్థాయిలో ఇక్కడ భవనాల నిర్మాణం పూర్తి చేసున్నా కనీసం పరిపాలనా రాజధాని గానన్నా ఉపయోగపడేది. జగన్‌కు కూడా ఇక్కడ నుండి మార్చాలన్న ఆలోచన వచ్చేది కాదు.

చంద్రబాబు ఎన్నో భవనాలకు మొండి గోడలు లేపి పెట్టారు. ఇప్పుడు అవన్నీ పూర్తి చేయాలన్నా వేలకోట్లు కావాలి. కేంద్రం నుండి చూస్తే ఆ స్థాయిలో ఆర్థిక సహకారం లేదు. ఇక్కడ రాజధాని కట్టే బదులు కొత్త ప్రాంతంలో అయితే పరిమిత స్థాయిలో అతి తక్కువ వ్యయంతో రాజధాని నిర్మాణం పూర్తి చేసుకోవచ్చన్నది జగన్ ఆలోచన.

జగన్ సీఎం బాధ్యతలు చేపట్టిన వెంటనే మొదట చేసింది అమరావతిలో పనులు నిలిపేయడం. ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. జగన్ తాడేపల్లి నుండే వ్యవహారాలు మొత్తం చూస్తున్నాడు. నిన్న వచ్చిన కృష్ణా వరదలతో అమరావతి రాజధానిగా సేఫ్ కాదనే అభిప్రాయం బలపడింది. రాజధానిగా అమరావతిని మారుస్తున్నారనే ప్రచారంతో అక్కడ రియల్ ఎస్టేట్ కూడా పూర్తిగా పడిపోయింది. జగన్ అమరావతిని రాజధానిగా అంగీకరించకపోవచ్చన్నది సమాచారం.

అయితే రాష్ట్ర రాజధానిపై ప్రభుత్వం నుండే ఒక స్పష్టత రావాల్సివుంది. అమరావతిపై సందేహాలను ముందు నివృత్తి చేయాల్సివుంది. అమరావతి రాజధానిగా ఉంటుందా? లేదా? లేకుంటే సేకరించిన భూములను తిరిగి రైతులకు ఇచ్చేస్తారా? అమరావతి కాకుండా ఇక కొత్త రాజధాని శివరామకృష్ణన్ కమిటి సూచించిన దొనకొండ ప్రాంతమేనా? లేక మంగళగిరి ప్రాంతాన్నే రాజధానిగా మలచుకుంటారా? ఈ ప్రశ్నలకు ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా రాజధానిపై క్లారిటీ ఇవ్వగలిగితే ప్రజల్లో నెలకొన్న గందరగోళ పరిస్థితులను నివారించవచ్చు.

# పాపం పండింది



***చేసిన పాపాలు ఎక్కడికీ పోవు... బ్రతికున్నప్పుడే ఈ భూమ్మీదే శిక్షలు అనుభవించాల్సిందే! ఎవరూ తప్పించుకోలేరు. కోట్లాది మంది ఆంధ్రులను మానసిక క్షోభకు గురిచేసి, వారి పట్ల కనీసం జాలి, దయ చూపని పాపానికి ఈరోజు ఓ నాయకుడు ఒక దొంగ మాదిరిగా జైలు గోడల మధ్య రిమాండ్ ఖైదీగా వున్నాడు. ఆ పాపాత్ముడే మాజీకేంద్రమంత్రి పి.చిదంబరం.***

ఎన్ఎక్స్ మీడియా కేసులో సిబిఐ అధికారులు ఆయనను ఈ నెల 21వ తేదీ రాత్రి ఢిల్లీలోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. 22వ తేదీ ఆయనను కోర్టులో ప్రవేశపెట్టగా కోర్టు నాలుగు రోజులు సిబిఐ కస్టడీకి ఆదేశించింది. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజనలో తొలి పాపి సోనియాగాంధీ అయితే, రెండో పాపి అప్పుడు హోంమంత్రిగా వున్న పి.చిదంబరం. దక్షిణ భారతదేశంలో తమిళనాడుకు ధీటుగా వుండేది, రాజకీయంగా 42ఎంపీ స్థానాలతో బలంగా వుండేది ఆంధ్రప్రదేశ్! 2004, 2009 ఎన్నికల్లో ఈ రాష్ట్రం నుండే కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లు వచ్చాయి. అప్పటి ముఖ్యమంత్రిగా వున్న దివంగత నేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం వద్ద అధిక ప్రాధాన్యత వుండేది. ఎంపి సీట్లు ఎక్కువగా వుండడం వల్లే ఏపి సీఎంకు అంతటి విలువ వుందని చిదంబరం గ్రహించాడు. వై.యస్. మరణం తర్వాత ఏపి విభజన విషబీజాలను సోనియా మెదడులో నాటాడు. 2012లో ఒకసారి కేంద్ర హోంమంత్రిగా వున్న పి.చిదంబరం విభజన ప్రకటన చేశాడు. అయితే అప్పుడు ఆంధ్రా ప్రాంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా మూకుమ్మడి రాజీనామాలు చేయడంతో విభజనపై ఆనాడు వెనక్కు తగ్గారు. కాని, 2014లో మాత్రం పి.చిదంబరం ఆధ్వర్యంలో విభజన ప్రణాళికను వ్యూహాత్మకంగా అమలు పరిచారు. ఏపికి రాజధాని లేకుండా, ప్రత్యేకహోదా ఇవ్వకుండా, నిధులపై స్పష్టత లేకుండా విభజన బిల్లును ఆమోదింపజేయడంలో ఆరోజు చిదంబరం పోషించిన పాత్రను ఆంధ్రులెవరూ మరువరు. కనీస న్యాయం చేయండని అడిగిన ఆంధ్రుల మొరను ఆరోజు ఈ చిదంబరం చెవికెక్కించుకోలేదు.

ఎంతమంది ఆంధ్రుల గుండె గోష్ట తగిలిందోగాని ఈరోజు దయనీయ స్థితిలోకి వెళ్లిపోయాడు. తాను కేంద్ర ఆర్థిక మంత్రిగా వుండగా 2007లో ఐఎన్ఎక్స్ మీడియాలోకి 307 కోట్ల విదేశీ పెట్టుబడులు రావడం, అది చిదంబరం కొడుకు కార్తి డబ్బులేనని సిబిఐ, ఇ.డిలు నిర్ధారించి కేసులు నమోదు చేయడంతో చిదంబరం మెడకు ఉచ్చు బిగుసుకున్నట్లయ్యింది. ఈ కేసు నుండి బయట పడడం కోసం ఆయన పడరాని పాట్లన్నీ పడ్డాడు. 20సార్లు బెయిల్ తెచ్చుకున్నాడు. ఈసారి మాత్రం ఢిల్లీ హైకోర్టు దయ చూపలేదు. ఈ కేసులో సిబిఐ, ఇడిలు సమర్పించిన సాక్ష్యాలను నమ్మడంతో కోర్టు చిదంబరం అరెస్ట్‌కు పచ్చజెండా వూపడంతో తమిళ తంబి అరెస్ట్ జరిగిపోయింది.

ఈ కేసే కాదు, ఇంకా పలు కేసులు, అవినీతి ఆరోపణలు చిదంబరాన్ని చుట్టుముట్టి వున్నాయి. కేంద్రంలో ఆర్థిక, హోంశాఖలను వెలగబెడుతున్న సమయంలో ఎందరో అవినీతి నేతల కేసులను చీకట్లో కాళ్ల పట్టించుకుని చెత్తబుట్టలో వేశాడన్న ఆరోపణలు కూడా వున్నాయి. చేసిన పాపాలే ఇప్పుడు శాపాలై వెంటాడుతున్నాయి. అన్నింటికి మించి ఆనాటి ఆంధ్రుల కన్నీళ్ళే ఈనాడు శాపగ్రస్థమై.. తమిళ తంబిని చుట్టుముట్టింది.

# అడుగు పెట్టిన అదాని!

(మొదటి పేజీ తరువాయి)

అదాని గ్రూప్ కొనుగోలు చేయగా, పోర్టు మేనేజింగ్ డైరెక్టర్‌గా వున్న చింతా శశిధర్ తన 28శాతం వాటా భాగస్వామ్యంతో కొనసాగనున్నారు. ఇప్పటి వరకు పోర్టు మేనేజింగ్ డైరెక్టర్‌గా వున్న ఆయనను పోర్టు ఛైర్మెన్‌గా నియమించనున్నట్లు సమాచారం.

కృష్ణపట్నం పోర్టుకు ఎంతో చరిత్ర వుంది. కృష్ణదేవరాయల కాలంలోనే ఇక్కడ పోర్టు నుండి విదేశాలకు ఎగుమతులు, దిగుమతులు జరిగినట్లు చరిత్ర చెబుతుంది. 1995లో అప్పుడు ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబునాయుడు కృష్ణపట్నం పోర్టుకు శంకుస్థాపన చేశారు. అయితే పోర్టు కాంట్రాక్ట్ తీసుకున్న నాట్కో కంపెనీ సకాలంలో పోర్టు నిర్మాణం చేపట్టలేకపోయింది. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అప్పుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి కృష్ణపట్నం పోర్టు పనుల కాంట్రాక్ట్‌ను నవయుగ ఇంజనీరింగ్ కంపెనీకి అప్పగించడం జరిగింది. దీంతో పోర్టు పనులు రేసుగుర్రంలా పరుగెత్తి 2008లోనే సోనియాగాంధీ చేతులమీదుగా పోర్టు ప్రారంభానికి నోచుకుంది. వైయస్ హయాంలోనే పోర్టుకు కావాల్సిన భూసేకరణ ఎంతో సామరస్యంగా జరిగింది. ఆయన హయాంలోనే పోర్టు సెజ్‌లోకి ఎన్నో పరిశ్రమలు రావడం, వేలాది మందికి ఉపాధి లభించడం జరిగాయి. అన్నింటికి మించి కృష్ణపట్నం పోర్టు రాకతో నెల్లూరు నగరం, చుట్టుపక్కల ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లింది.

వైయస్ మరణం తర్వాత పోర్టు పురోగతి నిలిచిపోయింది. ఆ తర్వాత రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, చంద్రబాబులు సీఎంలుగా వచ్చినా ఈ పోర్టు అభివృద్ధి గురించి పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు.

ఇప్పుడు కృష్ణపట్నం పోర్టులోని పెద్దవాటాదారుగా అదాని గ్రూప్ అడుగు పెట్టింది. ప్రైవేట్ పోర్టుల నిర్వహణలో దేశంలో అదాని గ్రూప్‌దే ఆధిపత్యం. ఈస్ట్‌కోస్ట్‌లోనే నాలుగు పోర్టులు ఆ గ్రూప్ చేతిలో వున్నాయి. అదానికి కేంద్ర ప్రభుత్వంతో సన్నిహిత సంబంధాలున్నాయి. పోర్టు పరిధిలోకి పెట్టుబడులను తీసుకురాగల సామర్థ్యముంది. కాబట్టి కృష్ణపట్నం పోర్టు సెజ్ భవిష్యత్‌లో మరింతగా అభివృద్ధి చెందే అవకాశముంది.

# శ్రద్ధాంజలి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాలలో వెలిగే ధృవతార, మాకు మార్గదర్శకులు, అనురాగమూర్తి

## కీ॥ శే॥ శ్రీ గునుపాటి సుబ్బరామిరెడ్డి గారు

(కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం)

పరమపదించి ఆగస్టు 27, 2019 నాటికి 29 సంవత్సరాలు నిండుతాయి
ఆ మహనీయమూర్తిని సంస్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి చేకూరుటకై ప్రార్థిస్తున్నాము.

అర్ధాంగి: **కీ॥శే॥ గునుపాటి రుక్మిణమ్మ**

కుమారులు – కోడళ్ళు

**గునుపాటి వెంకటకృష్టారెడ్డి – ఇందిరమ్మ**
**గునుపాటి జనార్ధన్‌రెడ్డి – సునీతమ్మ**
**గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి – శుభప్రదమ్మ**

కుమార్తెలు – అల్లుళ్ళు

**కోటిరెడ్డి నిర్మలమ్మ – కీ॥ శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి**
**అత్తివరపు విమలమ్మ – అత్తివరపు రామచంద్రారెడ్డి**
**దొడ్ల లలితమ్మ – దొడ్ల పద్మనాభరెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com